# వస్తువులు స్టాక్ రిజిస్టర్లు పక్కాగా నిర్వహించాలి





**– గురుకుల కళాశాల సందర్శించిన ఐటీడీఏ పీవో**

**రంపచోడవరం, మేజర్‌న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలోని ఏపిఆర్‌యస్ కళాశాలలు, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో నిత్యావసర వస్తువులకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లు పక్కాగా నిర్వహించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే ఆదేశించారు. రంపచోడవరం ఏపిఆర్ బాలికల కాలేజీని ఐటీడీఏ పీవో ప్రాజెక్ట్ అధికారి పరిశీలించడం జరిగింది. ముందుగా కాలేజీ ఆవరణ, క్లాస్ రూములు, నిత్యావసర వస్తువులకు సంబంధించిన స్టాక్ రూమును ప్రాజెక్ట్ అధికారి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా పిఓ సూరజ్ గానోరే మాట్లాడుతూ గురుకుల కళాశాలకు వచ్చే నిత్యావసర సరుకులు, కోడిగుడ్లు, అదేవిధంగా కూరగాయలు వారానికి రెండు రోజులపాటు కోడి మాంసం టెండర్ దారులు తీసుకువచ్చిన వెంటనే సంబంధిత రిజిస్టర్లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం మెనూ పక్కాగా అమలు చేయాలన్నారు. కళాశాలలో విద్యార్థులకు సంబంధించిన మరుగుదొడ్లుకు రన్నింగ్ వాటరు సరఫరా చేస్తూ పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆదేశించారు. విద్యార్థులకు సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

సూర్య

17వ

కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా

కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం,23 ఫిబ్రవరి 2024



# రూరల్‌లో హీట్ పుట్టిస్తున్న పొత్తు

**– బీసీలకు టికెట్ ఇవ్వాలని తెలుగు తమ్ముళ్ల డిమాండ్**



**కాకినాడ రూరల్, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** టిడిపి జనసేన పొత్తు కాకినాడ రూరల్‌లో హీట్ పుట్టిస్తోంది. గురువారం ఈ రెండు పార్టీల మధ్య విభేదాలు బహిర్గతమయ్యాయి. గురువారం ఉదయం కాకినాడ రూరల్ గంగరాజు నగర్‌లో కాకినాడ రూరల్ నియోజకవర్గం జనసేన కార్యాలయాన్ని ఆ పార్టీ రూరల్ ఇన్చార్జ్ పంతం నానాజీ ప్రారంభించారు. తెలుగుదేశం తరపున మాజీమంత్రి చిక్కాల రామచంద్రరావు, బిజెపి నాయకులు హాజరయ్యారు. జనసైనికులు అత్యధిక సంఖ్యలో హాజరై రూరల్ టిక్కెట్ నానాజీకి ఇచ్చేసారు. అందుకే కార్యాలయం ప్రారంభించారంటూ ప్రచారం చేసారు. ఇది జరిగిన కొద్దిసేపటికి రూరల్ నియోజవర్గానికి చెందిన బీసీ శెట్టిబలిజ, ఎస్‌సి నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ రూరల్ నుంచి శెట్టిబలిజ సామాజికవర్గానికి చెందిన పిల్లి అనంతలక్ష్మి, పశ్చిమగోదావరి జిల్లాలో పితాని సత్యనారాయణకు రెండు సీట్లు టిడిపి ఖచ్చితంగా ఇచ్చేది, ఈసారి టిడిపి సీటు కాకినాడ రూరల్‌లో టిడిపికి లేదంటున్నారు, జనసేనకి వదిలేస్తామంటున్నారు, ఇదే జరిగితే బీసీలం ఏకమవుతాం ఎస్సీల సహకారం తీసుకుంటాం, ఉద్యమం చేస్తామని మీడియా సమావేశంలోనే హెచ్చరికలు జారీ చేసారు. ఇప్పుడు ఇది రెండు పార్టీల నేతలకు గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లు అయింది. టిడిపి జనసేన పొత్తుతో ఎన్నికలు సమీపిస్తున్న వేళ రూరల్ తెలుగుదేశం పార్టీ నాయకుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని టిడిపి నాయకులు అవేదన వ్యక్తం చేశారు. కాకినాడ రూరల్ 49వ డివిజన్ మాజి కార్పొరేటర్ పలివెల ఉషారాణి నివాసంలో టిడిపి బిసి నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గంలో సుమారు 82 వేల మంది శెట్టిబలిజ ఓటర్లు ఉన్నారని, ఇతర బిసి ఓటర్లు సుమారు మరో 50 వేలమంది ఉన్నారని తెలిపారు. అలాంటి నియోజకవర్గంలో బిసి లకు కాకుండా వేరే వర్గంవారికి సీటు కేటాయిస్తే తాము అంతా టిడిపికి వ్యతిరేకంగా పనిచేస్తామని హెచ్చరించారు. ఇక్కడ గ్రామ స్థాయిలో పరిస్థితి అధిష్టానానికి తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ఈ మీడియా సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. పొత్తులో బాగంగా అయినా ఈ నియోజకవర్గంకి ఎవరికి సీటు కేటాయిస్తారు అనే విషయం ఇప్పటివరకు తేల్చకుండా ఇరు పార్టీ నాయకుల్ని సమన్వయం చేయకుండా ఉన్నారని, ఇటువంటి పరిస్థితుల్లో కేవలం 20 రోజులు వ్యవధిలో ఎన్నికలకు సిద్ధం అవుతున్న వేళ సీటు పిల్లి అనంతలక్ష్మి సత్తిబాబుకి కాకుండా వేరేవారికి కేటాయిస్తే తాము అంతా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో శెట్టిబలిజ సాధికారిక జిల్లా అధ్యక్షులు పంపన బుజ్జి, మాజి జెడ్పీటీసీ బుంగా సింహాద్రి, పెరిక సాధికారిక జిల్లా అధ్యక్షులు నరసింహారావు, విశ్వ బ్రాహ్మిన సాధికారిక జిల్లా అధ్యక్షులు పండూరు జయకృష్ణ , కొప్పుల వెలమ సంఘం అధ్యక్షులు యాసలపు కన్నబాబు, తూర్పు కాపు సాధికారిక సమితి జిల్లా కన్వీనర్ వెలగల లోవరాజు, రాష్ట్ర రజక సంఘ సభ్యులు తాతిపుడి రామకృష్ణ, వాసంశెట్టి అంజిబాబు, అగ్నికుల క్షత్రియ జిల్లా అధ్యక్షులు పెమ్మడి శ్రీను, ఇతర బిసి నాయకులు తదితరులు పాల్గొన్నారు. దీంతో రూరల్‌లో పొత్తు పొడవదు అని స్పష్టమైంది. జనసేనకు టికెట్ ఇచ్చినా, టిడిపి నుంచి శెట్టిబలిజ లేదా బీసీలకు కాకుండా వేరే సామాజికవర్గానికి ఇచ్చినా పిల్లి సత్తిబాబు స్వతంత్రంగా పోటీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదే నేపథ్యంలో వైసీపీకి చెందిన పలువురు కీలక నాయకులు పిల్లి దంపతులతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.

# దుర్గాడలో అయ్యప్పస్వామి విగ్రహ ప్రాణప్రతిష్ట

**– పాల్గొన్న కాకినాడ ఎంపీ వంగా గీత**





**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** గొల్లప్రోలు మండలం దుర్గాడ శ్రీ ఉమారామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం శ్రీ హరిహరసుత అయ్యప్పస్వామి విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాకినాడ పార్లమెంటు సభ్యురాలు వంగా గీతా విశ్వనాథ్ దంపతులు విచ్చేసి, స్వామివారిని దర్శించుకుని ఆలయ పండితులచే తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం దుర్గాడ శివాలయం కమిటీ నిర్వహిస్తున్న అన్న సమారాధన కార్యక్రమంలో పిఠాపురం వైఎస్ఆర్ పార్టీ ఇంచార్జ్ వంగా గీతా విశ్వనాథ్ దంపతులు పాల్గొన్నారు. అనంతరం దుర్గాడ సర్పంచ్ పంపన సుబ్బలక్ష్మి సూర్యచంద్రరావు అధ్యక్షతన దళితవాడ సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా చేరుతున్నయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకుంటూ ప్రజాసమస్యలు పరిష్కరించే దిశగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తదుపరి పంచాయతీ కార్యదర్శి సర్పంచ్ సుబ్బలక్ష్మి సూర్యచంద్రరావుతో దుర్గాడ ప్రజలకు సురక్షితమైన త్రాగునీరు పారిశుద్ధ్యం పనులపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి వంగా గీతా విశ్వనాథ్‌తోపాటు వైసీపీ నాయకులు, గొల్లప్రోలు జడ్పిటిసి ఉలవకాయల లోవరాజు, చందుర్తి సర్పంచ్ అలీ పాపా, ఉప సర్పంచ్ కోనేటి పెద్దకాపు, వెలుగులు సత్యనారాయణ, దుర్గాడ ఎంపిటిసి ఆకుల శ్రీను, గొల్లపల్లి నానాజీ, పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 37వ డివిజన్‌లో జనసేన 'యుద్ధానికి మేము సిద్ధం' కార్యక్రమం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ సిటిలో జనసేన పార్టీ పి.ఏ.సి సభ్యులు మరియు కాకినాడ సిటి ఇంచార్జ్ ముత్తా శశిధర్ నాయకత్వంలో పినపోతు సత్తిబాబు మరియు బలసాడి శ్రీనుల ఆధ్వర్యంలో గురువారం స్థానిక 37 డివిజన్ ప్రగోడా స్కూలు ప్రాంతంలో ప్రతిచేతికి ఉపాధికోసం యుద్ధానికి మేము సిద్ధం అనే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముత్తా శశిధర్ మాట్లాడుతూ ఈనాలుగు ఏండ్లలో కాకినాడలో ఉపాధి కల్పించలేకపోయిన ఎం.ఎల్.ఏ మరియు ప్రభుత్వం ఎవరంటే జగన్మోహన్ రెడ్డి పాలనలో ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. వీరిని నేను ఒకటే అడుగుతున్నాను అదేంటంటే కాకినాడలో యువతకి ఉపాధి కల్పించలేని మీరు దేనికోసం సిద్ధంగా ఉన్నారు, వీళ్ళ జీవితాలని చిన్నాభిన్నం చేయడానికి సిద్ధంగా ఉన్నారా, వీళ్ళకి ఎలాంటి ఉపాధి రాకుండా కాకినాడలో ఎలాంటి కర్మాగారం రాకుండా చేసేందుకు సిద్ధంగా ఉన్నారా మీరు సమాధానం చెప్పాలని డిమాండ్ చేసారు. ఏదైనా మాట్లాడితే ఆవేశంగా టాపిక్ డైవర్ట్ చేస్తే ప్రజల అవసరాలు తీరవనీ, నిజమైన ప్రజాప్రతినిధిగా మీరు కాకినాడలోని యువతకి ఏంచేసారో శ్వేతపత్రాన్ని విడుదల చేయాలన్నారు. తాము ఎప్పటినుండో ఒకటే చెపుతున్నామనీ రాష్ట్రంలో యువత పూర్తిగా నిర్వీర్యం అయిపో యారనీ, పవన్ కళ్యాణ్ ఒక్కరే వారికి ఆశాదీపమనీ, ఆయన అందుకు తగ్గట్టుగా మా మేనిఫెస్టోలో ప్రతి చేతికి పని, ప్రతి చేనుకీ నీరు ఇదే మొదటి అంశంగా మేనిఫెస్టో తయారు చేయబోతున్నామనీ, కాకినాడలో అందరికీ తాము ఈ హామీ ఇస్తున్నామనీ, కావున త్వరలో జరగబోతున్న ఎన్నికలలో జనసేన తెలుగుదేశం పార్టీల ఉమ్మడి ప్రభుత్వాన్ని గెలిపించి అందరూ పనిని పొందే పాలనను పొందేలా ముందుకు సాగుదామని అన్నారు. ఈ కార్యక్రమంలో సాదనాల రమేష్, బొద్దు రాజు,మాతాచిన్న,నందా,సహారా రాజేష్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ నాయకులు హౌస్ అరెస్టు



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి ఛలో సెక్రటరీయేట్ కార్యక్రమంలో పాల్గొనడానికి వెలుతున్న నాయకులను అంబాజీపేటలో గురువారం పోలీసులు హౌస్ అరెస్టు చేసారు. దగా డీఎస్సీ వద్దు మెగా డీఎస్సీ ముద్దు అనే కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి ఛలో సెక్రటరీయేట్ కార్యక్రమాన్ని అడ్డుకున్న జగన్ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీని చూచి జగన్ ప్రభుత్వం బయపడుతుందని, సిద్ధం సభలో ముఖ్యమంత్రి సమక్షంలో విలేకర్లపై దాడి చేసినటివంటి వైస్సార్‌సీపీ గుండాలను ఇంతవరకు అరెస్ట్ చేయలేదని మండిపడ్డారు. కానీ రాష్టంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు అందరిని హౌస్ అరెస్టులు చేసారని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగం అవకాశాలు కల్పించమని పోరాటం చేస్తున్నవారిని అరెస్ట్ చేయడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. అంబాజీపేటలో మహమ్మద్ ఆరిఫ్ స్వగృహంలో గృహ నిర్భంధంలో ఏపీసీసీ జనరల్ సెక్రెట్రిలు మహమ్మద్ ఆరిఫ్, మాచవరపు శివన్నారాయణ, మండల్ కాంగ్రెస్ అధ్యక్షులు నెల్లి వెంకటరమణ, మండల ప్రధాన కార్యదర్శి అదుర్తి నారాయణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇస్మాయల్ ఉన్నారు.

# రూ.114 కోట్లతో సిద్ధమైన ఈఎస్ఐ ఆస్పత్రి

– 25న ప్రధానితో వర్చ్యువల్‌గా ప్రారంభం – కాకినాడ ఎంపీ వంగా గీత విశ్వనాథ్ వెల్లడి

– ఏర్పాట్లు పరిశీలించిన ఎంపీ, ఎమ్మెల్యే, అదనపు కమిషనర్, అధికారులు







**కాకినాడ, మేజర్ న్యూస్ :** అత్యాధునిక వసతులతో రూ.114 కోట్ల వ్యయంతో రూపుదిద్దుకున్న ఈఎస్‌ఐ ఆస్పత్రిని ఈ నెల 25వ తేదీన ప్రధాని నరేంద్రమోదీ వర్చ్యువల్‌గా ప్రారంభించనున్నారని కాకినాడ పార్లమెంట్ సభ్యురాలు వంగా గీతావిశ్వనాథ్ చెప్పారు. ప్రధాని ప్రారంభించనున్న నేపథ్యంలో సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, వివిధ విభాగాల అధికారులతో కలిసి గురువారం సాయంత్రం కాకినాడ సాంబమూర్తినగర్ లోని ఈఎస్‌ఐ ఆస్పత్రిని ఎంపీ సందర్శించారు. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, ఎడిసి సి.హెచ్. నాగ నరసింహారావు, ఇతర అధికారులు ఆమె వెంట ఉన్నారు. హాస్పటల్‌లోని వివిధ విభాగాలను, ఆపరేషన్ థియేటర్లను, జనరల్ వార్డులను ఆమె పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎంపీ వంగా గీత మాట్లాడుతూ దాదాపు 65వేల మంది కార్మికులు, సుమారు రెండు లక్షల మంది ఆయా కార్మిక కుటుంబాలకు ప్రయోజనం కలిగే ఈ 100 పడకల ఆస్పత్రి మరో రెండు రోజుల్లో వినియోగంలోకి రాబోతుందన్నారు. ఇక్కడి నుంచి వేరొక ప్రాంతానికి ఈఎస్‌ఐ ఆస్పత్రి తరలిపోయే పరిస్థితుల్లో కేంద్ర మంత్రి గంగ్వార్ కు ఇక్కడ ఈఎస్‌ఐ ఆసుపత్రి ఏర్పాటు కావాల్సిన ఆవశ్యకతను వివరించడంతో సానుకూలంగా స్పందించి రూ.100 కోట్లు మంజూరు చేశారన్నారు. 2020లో శంఖుస్థాపన చేసి కరోనా, భారీ వర్షాలను సైతం అధిగమిస్తూ అత్యంత వేగంగా ఈ నిర్మాణాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చామన్నారు. ఆరంభంలో ఈఎస్‌ఐ ఆస్పత్రి కోసం రూ. 100 కోట్లు మంజూరు కాగా, అత్యాధునిక వసతుల కోసం రూ.14 కోట్లు అదనంగా మంజూరు చేశారన్నారు. ఆస్పత్రితోపాటు పనిచేసే వైద్యులు, ఇతర ఉద్యోగుల కోసం క్వార్టర్స్ కూడా అదే ప్రాంగణంలో నిర్మించామన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 25న వర్చ్యువల్‌గా ప్రారంభించనున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన సమయం ఇంకా ఖరారు కావాల్సి ఉందని చెప్పారు.

సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ఎంపీ వంగా గీత ప్రత్యేక చొరవ తీసుకోవడంతో ఈఎస్‌ఐ ఆస్పత్రి ఈ ప్రాంతానికి మంజూరై నిర్మాణాన్ని పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. ఇది కాకినాడ ప్రజల అదృష్టమన్నారు. సుమారు ఆరు ఎకరాల విస్తీర్ణంలో సర్వాంగ సుందరంగా అన్ని హంగులతో ప్రారంభం కాబోతుందని చెప్పారు. సుమారు లక్షా 50 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆస్పత్రి నిర్మాణమైందన్నారు. పోర్టు ఆధారిత కాకినాడ నగరంలో ఈ ఆస్పత్రి ఇక్కడి కార్మిక కుటుంబాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉండగలదన్నారు. ఆస్పత్రి నిర్మాణానికి నిధులు మంజూరు చేసి వేగంగా పూర్తికావడానికి కారణమైన ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వంగా గీతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, ఎస్‌ఈ పి.సత్యకుమారి, సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ విభాగం డిఈ డి.లక్ష్మయ్య, ఎంహెచ్‌వో డాక్టర్ పృద్వీచరణ్, ఏఈ వై.నాగేశ్వరరావు, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్, వైద్యులు డాక్టర్ అన్వేష్, డాక్టర్ మహిధర్ తదితరులు పాల్గొన్నారు.

# పద్నాలుగు సంవత్సరాలు పార్టీ అభివృద్ధి కృషి చేశా

**– పార్టీ తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు**

**– వైఎస్ఆర్‌సిపి మండల శాఖ మాజీ అధ్యక్షుడు చినబాబు**



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పద్నాలుగు సంవత్సరాలపాటు మండలంలోని 16 గ్రామాలలో కృషి చేశానని, పార్టీ ప్రాధాన్యత ఇవ్వలేదని వైఎస్ఆర్‌సిపి మండల శాఖ మాజీ అధ్యక్షుడు చినబాబు తన ఆవేదన వ్యక్తం చేశారు. జి.అగ్రహారంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చినబాబు మాట్లాడుతూ పి.గన్నవరం నియోజవర్గ ఎమ్మెల్యేగా చిట్టిబాబుకు కేటాయించాలని, లేనిపక్షంలో పార్టీ మండలశాఖ అధ్యక్షులుగా రాజీనామా చేస్తానని గతంలో తెలియజేశా నని, అదే విధంగా ఈ నెలలో నాతో పార్టీలో పనిచేసిన కార్యకర్తల సమక్షంలో మాటకు కట్టుబడి పార్టీ మండలశాఖ అధ్యక్ష పదవికి రాజీనామా చేయడం జరిగిందని అన్నారు. అయితే అప్పటినుండి అధిష్టానం గానీ, నియోజవర్గ నాయకులు గాని పట్టించుకోలేదని, దీంతో మనస్థాపం చెందానని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజవర్గంలోని మండలంలోని పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషి చేశానని అన్నారు. నేను పద్నాలగు సంవత్సరాలపాటు పార్టీ అభివృద్ధికి కృషిచేసిన నన్ను గుర్తించకపోవడం కార్యకర్తలు గమనించాలని, పార్టీ కోసం ఆర్థికంగా నష్టపోయానన్న విషయాన్ని తెలుయజేసుకుంటున్నానని, పార్టీ మండలశాఖ అధ్యక్ష పదవిని కనీసం సమాచారం ఇవ్వకుండా మరొకరికి కేటాయించడంతో మనస్థాపం చెంది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నానని అన్నారు. నాతో పాటుగా గంగలకుర్రు సొసైటీ అధ్యక్షులు మట్టపర్తి చంద్రశేఖర్, ముక్కామల సొసైటీ అధ్యక్షులు వాసంశెట్టి రాంబాబు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కాండ్రేగుల శ్రీ నుబాబు, మాచవరం ఇటికాలమ్మ దేవస్థానం చైర్మన్ చప్పిడి సుబ్రహ్మణ్యం, జిల్లా కార్యదర్శి మట్టపర్తి వెంకటేశ్వరరావు తదితరులు నాతోపాటుగా పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. వేరే పార్టీలోచేరే విషయమై నాయకులు, కార్యకర్తలతో చర్చించి వారి అభిప్రాయంలో నిర్ణయం తీసుకుంటానని చినబాబు అన్నారు.

## జనసేన పార్టీలోకి 38 కుటుంబాలు చేరిక



**చింతూరు, మేజర్ న్యూస్ :** చింతూరు మండలం తుమ్మల పంచాయతీ రింగల గ్రామం నుంచి సోయం శ్రీను గ్రామ పటేల్ ఆధ్వర్యంలో 38 కుటుంబాలు జనసేన పార్టీలో చేరిక అవ్వడం జరిగిందని మండల అధ్యక్షుడు మడివి రాజు అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా అయన పాల్గొని వారికి కండువా కప్పి జనసేన సేన పార్టీలోకి ఆహ్వానించారు. మడివి రాజు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రస్తుత ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండకడుతూ జనసేన విధివిధానాలను వివరించారు. ఈ కార్యక్రమనికి చింతూరు మండల ముఖ్య నాయకులు తీగల రవి, బేడే సతీష్, కారం దుర్గారావు, పొడియం నాగార్జున, ఉయిక వెంకటేష్, బాబురావు, గ్రామస్తులు సోయం రాజులు, సోయం సత్యం, రవ్వ మంగయ్య, ముచ్చిక బుచ్చయ్య, సోయం సీతమ్మ, చినక్క, దారమ్మ తదితరులు పాల్గొన్నారు.

## యువతకు ఉద్యోగ అవకాశాలు రావాలంటే చంద్రబాబు రావాలి

**– మై ఫస్ట్ ఓట్ ఫర్ సి.బి.ఎన్. పోస్టర్ ఆవిష్కరణ చేసిన కొండబాబు**



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** యువతకు ఉద్యోగ అవకాశాలు రావాలంటే చంద్రబాబు ప్రభుత్వం రావాలని యువత కోరుకుంటున్నారని కాకినాడ సిటీ మాజీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. గురువారం కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు నిర్వహించిన కార్యక్రమంలో మై ఫస్ట్ ఓట్ ఫర్ సిబిఎన్ పోస్టర్ ఆవిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ మోసపూరిత మాయమాటలతో యువతను మోసం చేసి అధికారం చేపట్టిన జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ఉద్యోగాలు భర్తీ చేయకుండా, రాష్ట్రానికి ఎటువంటి పరిశ్రమలు తీసుకురాకుండా, జే-టాక్స్ పేరుతో రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలను ఇతర రాష్ట్రాలకు తరలిపోయేలా చేసాడని, అధికారం చేపట్టిన వెంటనే నిరుద్యోగులకు 5 లక్షల ఉద్యోగాలు కల్పిస్తానని హామీలు ఇచ్చి, ఫిష్ మార్కెట్లు, మటన్ షాపులో, బ్రాందీ షాపుల్లో ఉద్యోగాలంటూ యువత భవిష్యత్తును నాశనం చేశాడని, తెలుగుదేశం జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయి కాబట్టి రాష్ట్రంలో యువతీ యువకులు ప్రతీ ఒక్కరూ మై ఫస్ట్ ఓట్ ఫర్ చంద్రబాబు నినాదంతో సంసిద్ధంగా ఉన్నారని కొండబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం సిటీ అధ్యక్షులు మల్లిపూడి వీరు, తెలుగు ప్రొఫెషనల్ వింగ్ కాకినాడ జిల్లా అధ్యక్షులు వనమాడి మోహన్ వర్మ, నాయకులు పలివెల రవి, తుమ్మల రమేష్, గదుల సాయిబాబా, గాది శివరామకృష్ణ, ఎస్.కె. రహీమ్, మీసాల సునీత, పిర్ల లక్ష్మీ ప్రసన్న, సత్యవేణి, దుర్గా దర్శన్, గుజ్జు లక్ష్మణరావు, చింతలపూడి రవి, గెడ్డం పూర్ణ, పాలిక సూర్య, యాదవ శ్రీను, నిద్రబింగి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ట్రినిటీలో మహిళకు అరుదైన కేన్సర్ శస్త్ర చికిత్స



కాకినాడ, మేజర్ న్యూస్ : సాధారణ వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి వచ్చిన మహిళకు అన్ని పరీక్షలు చేసి అండాశయ కేన్సర్ వ్యాధి అని ట్రినిటీ ఆసుపత్రి వైద్యులు నిర్ధారించారు. తక్షణమే ఆమెకు హైపెక్ విధానం ద్వారా చికిత్సను నిర్వహించి ప్రాణాపాయం నుంచి తప్పించారు. గురువారం కాకినాడ పిఠాపురం రోడ్డులో ఉన్న ట్రినిటీ ఆసుపత్రిలో కాకినాడకు చెందిన 50 ఏళ్ల మహిళ టి.భవానికి కేన్సర్ శస్త్ర చికిత్స నిర్వహించిన విధానంపై వైద్యులు కౌశిక్ హరి, మేకతోటి భరత్, టి.మోహన్ విజయ్, ఏ.బాలు లు వివరించారు. భవాని సాధారణ కడుపు ఉబ్బరం అంటూ ఆసుపత్రికి పరీక్ష నిమిత్తం రాగా ఆమెకు వైద్యులు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి అండాశయ కేన్సర్‌గా నిర్ధారించామన్నారు. అప్పటికే ఆమె మూడవ దశలోకి వెళ్లిపోయిందని చెప్పారు. ఈ విషయాన్ని వారి కుటుంబసభ్యులకు ఆమె తెలపగా వారు భవానికి శస్త్రచికిత్స చేసేందుకు అంగీకరించారన్నారు.

గురువారంఆమెకు ఉభయగోదావరి జిల్లాలో తొలిసారిగా హైపెక్ విధానం ద్వారా చికిత్స నిర్వహించామని, ప్రస్తుతం ఆమె కోలుకుంటుందని వైద్యులు తమ ఆసుపత్రిలో తెలిపారు. అండాశయం నుంచి కీమోథేరపి విధానంలో కూడా భవానికి వైద్యం అందించినట్లు వైద్యులు తెలిపారు. తమ ఆసుపత్రిలో అన్ని విధాల వైద్య సదుపాయాలను కల్పించినట్లు వైద్యులు కౌశిక్, విజయ్, శైలేంద్రర కిషోర్, భరత్, బాలులు చెప్పారు.

## జనసైనికుని కుటుంబానికి ఆర్థిక సాయం



**అల్లవరం, మేజర్ న్యూస్ :** అల్లవరం మండలం కోదూరుపాడు గ్రామంలో జనసైనికుడు, కోదూరుపాడు గ్రామ కమిటీ వైస్ ప్రెసిడెంట్ అయిన నుట్టుకుర్తి కళ్యాణ్ ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. ఈ క్రమంలో నుట్టుకుర్తి కళ్యాణ్ భార్య మౌనికకు జనసేనపార్టీ నాయకులు రూ.15,000లు ఆర్థిక సహాయం అందజేశారు. అమలా పురం నియోజకవర్గం జనసేనపార్టీ ఇంచార్జ్ శెట్టిబత్తుల రాజబాబు చేతుల మీదుగా ఈ ఆర్థిక సహాయం అందజేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో అల్లవరం మండల జనసేన నాయకులు పిల్లా ప్రసాద్, శిరంగు సత్యనారాయణ, మేడిద శంకరం, కంకిపాటి వీరబాబు, కటకిరెడ్డి బాబి, వంగ నాయుడు, కాకిలేటి హరికృష్ణ, తిక్క బాబ్జి, రుద్రరాజు చిట్టిబాబు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ సభ్యులు సహకారం



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** ఇటీవల పుల్లేటికుర్రు-వ్యాఘ్రేశ్వరం శివారు గొల్లగుంట గ్రామంలో సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన గుబ్బల వెంకటరమణ కుటుంబానికి రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సహకారం అందచేసింది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు రెడ్ క్రాస్ చైర్మన్ కొరుకొండ సత్యనారాయణ (ఢిల్లీ నారాయణ) సూచనలతో రెడ్ క్రాస్ సభ్యులు మరియు స్థానిక ఎమ్మార్వో జె.విమల కుమారి, గ్రామ సర్పంచ్ బాలరాజు చేతుల మీదుగా వంట సామగ్రి, టార్పాలిన్, హైజిన్ కిట్, బియ్యం, బట్టలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు బేహరా వీర హనుమంతరావు, ఒరిగేత బాలరాజు, లక్కింశెట్టి భాస్కరరావు, ప్రసాద్, స్టాలిన్, రత్న ప్రసాద్, ఎంపీటీసీ వెంకటేష్, వార్డు మెంబర్ రామతులసి, ఆర్.ఐ. ఇబ్రహీం, వీఆర్వో మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా వాలంటీర్లు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివి







**– రాష్ట్రంలో మెరుగైన పరిపాలన వ్యవస్థకు మొట్టమొదటి సాక్షులు వాలంటీర్లు**
**– మంత్రి వేణుగోపాలకృష్ణ**

**కడియం, మేజర్ న్యూస్ :** దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను, అనుబంధంగా వాలంటీర్ సేవా వ్యవస్థ ను ప్రవేశపెట్టి దేశానికే ఆదర్శంగా నిలిచారని జిల్లా ఇన్చార్జి మంత్రి బీసీ సంక్షేమం సమాచార పౌర సంబంధాలు సినిమా ఆటోగ్రాఫీ శాఖ మంత్రి రాజమండ్రి రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాల కృష్ణ పేర్కొన్నారు. గురువారం కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన వాలంటరీలకు వందనం కార్యక్రమానికి మంత్రి వేణుగోపాల కృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వాలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర, పురస్కారాలను అవార్డులను స్థానిక నాయకులు , అధికారులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వేణు గోపాలకృష్ణ మాట్లాడుతూ అవినీతి, వివక్షకు తావు లేకుండా పారదర్శకంగా ప్రజలకు సేవలందిస్తున్న వాలంటీర్లను గుర్తించి వారికి ప్రోత్సాహకంగా అవార్డులను, నగదు ప్రోత్సాహం ప్రభుత్వం అందిస్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి గా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆశయ సాధనకు , ప్రజల కోసం వాలంటీర్లు చేస్తున్న సేవలు ఎంతో గొప్పవన్నారు. వరుసగా నాల్గవ ఏడాది వాలంటీర్లకు వందనం పేరుతో ఉత్తమ సేవలందించిన వారికి అవార్డులు ప్రధానం చేయడం జరుగుతోందనీ , ఇందులో పాల్గొనడం సంతోషకరమన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని అందజేయాలని పేర్కొన్నారు. అవార్డుల ప్రధానోత్సవం లో భాగంగా సేవా వజ్ర కింద సర్టిఫికెట్, శాలువ, బ్యాడ్జ్, మెడల్ తో పాటు 30 వేల రూపాయల నగదు, సేవా రత్న కింద సర్టిఫికెట్, శాలువ, బ్యాడ్జ్, మెడల్ తో పాటు 20 వేల రూపాయల నగదు, సేవా మిత్ర కింద సర్టిఫికెట్, శాలువ, బ్యాడ్జ్, మెడల్ తో పాటు 15 వేల రూపాయల నగదును అందించి సత్కరించడం జరిగిందని మంత్రితెలిపారు. కడియం మండలంలో 482 మంది వాలంటీర్లకు ప్రోత్సాహాన్ని అందించడం జరిగిందని మంత్రి పేర్కొన్నారు. కడియం మండలంలో రాష్ట్ర ప్రభుత్వం 2019 నుంచి ఇప్పటి వరకు ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాల కింద 2,30,455 మంది లబ్ధిదారులకు రు. 196.22 కోట్ల రూపాయల ప్రయోజనాన్ని గ్రామ ప్రజలకు చేకూర్చడం జరిగిందన్నారు. గాంధీజీ కోరుకున్న సేవా సైన్యం అనే వ్యవస్థను సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టి ప్రజలకు సంక్షేమ పాలనను నందిస్తున్నారన్నారు. ప్రతి మారుమూల ప్రాంతంలో నివసించే పేదవానికి సమాజంలో సముచిత స్థానాన్ని కల్పించే విధంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారని పేర్కొన్నారు. కుల మతాలకు అతీతంగా సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి నేరుగా డిబిటి ద్వారా వారి బ్యాంకు ఖాతాలకే జమ చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచారని మంత్రి స్పష్టం చేశారు. పేదరికం నిర్మూలించాలనే లక్ష్యంతో నాడు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీ ద్వారా రు.2.5 లక్షలు వైద్యాన్ని అందించడంతోపాటు విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఫీజు రియంబర్స్మెంట్ ప్రవేశ పెట్టారన్నారు. నేడుసీఎం జగన్మోహన్ రెడ్డి తండ్రికి తగ్గ తనయుడిగా, అంతకు మించి ఆరోగ్యశ్రీని రు.25 లక్షలకు పెంచడంతో పాటు విద్యాభివృద్ధికి నాడు నేడు ద్వారా పాఠశాలల ఆధునికరణ, మౌలిక సదుపాయాలు , అమ్మ ఒడి,విద్యా కానుక విద్యా దీవెన వసతి దీవెన, విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా జగనన్న సంపూర్ణ పోషన ప్లస్ కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్ళినా గుర్తింపు కోసం మంచి ఫలితాలను సాధించే దిశగా ప్రాథమిక స్థాయి నుండే ఇంగ్లీష్ మీడియాని ప్రవేశ పెట్టడం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో గతంలో 11 ప్రభుత్వ వైద్య కళాశాలలుంటే, నేడు సీఎం జగన్మోహన్ వాటికి తోడుగా మరో 17 వైద్య కళాశాలను రాష్ట్రంలో నూతనంగా నిర్మించి చరిత్రలో నిలిచిపోనున్నారు. వాలంటీర్ అంటే సేవా సైన్యం అని ప్రజా సేవ చేయడంలో వాలంటీర్ ముందు వరుసలో నిలుస్తారని మంత్రి పేర్కొన్నారు. రాజకీయాలంటే పారదర్శకతతో, నిస్వార్ధంగా ప్రజలకు సేవ చేయడమేనని ఆ దిశగా నా వంతు కర్తవ్యం గా పాలకునిగా కాకుండా సేవకునిగా ప్రజలకు సేవ చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి వేణు గోపాలకృష్ణ వాలంటీర్లకు సేవా వజ్ర క్రింద... వాసంశెట్టి అశ్విని, కడియపుసావరం- 2 .. తిన్నాతి కనకరత్నం, పొట్టిలంక - 1, %సేవా రత్న క్రింద... బల్ల లక్ష్మీ, జేగురుపాడు - 2, జగన ఒ.ఎ. కుమారి, కడియం- 3 కిరాయయు గోవిందు, కడియపుసావరం -2, చాగంటి కిశోర్ బాబు. వేమగిరి - 1, పెందుర్తి పద్మిని, వేమగిరి - 4, సేవా మిత్ర క్రింద...దుళ్ళ - 1, దుళ్ళ - 2, మురమండ, మురమండ - 2, యం.ఆర్. పాలెం -1, యం.ఆర్. పాలెం - 2, జేగురుపాడు - 1, జేగురుపాడు - 2, దామిరెడ్డిపల్లి, పొట్టిలంక- 1, పొట్టిలంక - 2, కడియపులంక -1, కడియపులంక - 2, కడియపులంక - 3, కడియపులంక - 4, వీరవరం - 1, వీరవరం - 2, వేమగిరి -1, వేమగిరి - 2,వేమగిరి - 3, వేమగిరి - 4, కడియపు సావరం - 1, కడియపు సావరం -2, కడియం -1, కడియం -2, కడియం-3, కడియం—4లోని సచివాలయాల్ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి. రాజ్ మనోజ్, వైయస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, వైయస్ఆర్సిపి మండల అధ్యక్షులు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి చిన వీరభద్రయ్య, జె.సి.ఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తి, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ ఈలి గోపాల్ రావు, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి టేకి శ్రీనివాస్, మైనార్టీ సెల్ కన్వీనర్ భాషా, కడియం మాజీ సర్పంచ్ దాసరి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

## ఐనోదయచే సేవా కార్యక్రమాలు నిర్వహణ



**కాకినాడ, మేజర్ న్యూస్ :** రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం స్థానిక ఐనోదయ హాస్పిటల్‌లో నిర్వహించిన సేవా కార్యక్రమాలను క్లబ్ అధ్యక్షులు నరహరిశెట్టి రవికృష్ణ, ఐనోదయ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ గొడవర్తి రామ్మోహన్ సంయుక్తంగా ప్రారంభించారు. సుమారు లక్ష రూపాయల విలువ కలిగిన సైకిళ్ళు మరియు బెడ్లను ఐనోదయ హాస్పిటల్ సమకూర్చింది. రోటరీ చేయూత స్వచ్ఛంద సేవా సంస్థకు చెందిన ఐదు సైకిళ్లను విద్యార్థులకు మరియు లివింగ్ హ్యాండ్స్ అంధుల ఆశ్రమానికి చెందిన ఐదుమందికి ఖరీదైన బెడ్లను పంపిణీ చేశారు. రవికృష్ణ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహణలో ఐనోదయ అందిస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలుపుకున్నారు. క్లబ్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు చేయూత ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలోఐనోదయ హాస్పిటల్ సీఈఓ లావణ్య, క్లబ్ కార్యదర్శి చందు, చేయూత సంస్థ చైర్మన్ రవి, మాచారెడ్డి, ధనసాగర ప్రసాద్, చార్మినార్ వర్మ,వడ్డాదిదీక్షిత్, బదిరెడ్డి వెంకన్న, భాషా, హాస్పటల్‌కు చెందిన వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జనసేనపార్టీలో చేరికలు



**అంబాజీపేట, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు, ఈ రాక్షస పరిపాలన అంతమొందించి రాష్ట్ర ప్రజలశ్రేయస్సు,రాష్ట్ర అభివృద్ధికి జనసేనపార్టీ, తెలుగుదేశం కలసి కృషి చేస్తాయని పి.గన్నవరం నియోజకవర్గంజనసేనపార్టీ ఇన్‌చార్జ్ గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఇరుసుమండ గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన యువత పెద్దలు దళిత, బిసి, వైశ్య కులాలకు చెందినవారు గురువారం జనసేనపార్టీ లో చేరారు. సుంకరరామదాసు నాయుడు ఆధ్వర్యంలో గ్రామంలో వివిధ కులసంఘం యాదవులు, దళితులు, వైశ్యులు, శెట్టిబలిజ సామాజికవర్గం, ఓసి సామాజికవర్గానికి చెందినవారు అధిక సంఖ్యలో పార్టీలో చేరారు. గిడ్డి సత్యనారాయణ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు దృష్టి పెట్టుకొని జనసేనపార్టీ తెలుగుదేశం కలసి పనిచేసి ఈ రాక్షస పరిపాలన అంతమొందించి రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. గ్రామస్థాయిలో ప్రజలకు, మహిళలకు అండగా నిలబడతానని, ఏ సమస్య ఉన్నాతమ దృష్టిలోకి తీసుకుని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేనపార్టీ ఉపాధ్యక్షులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, ఉమ్మడి తూ.గో. జిల్లా సెక్రటరివాసంశెట్టి కుమార్, మండలశాఖ అధ్యక్షుడు దొమ్మేటి సాయికృష్ణ, టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజర్ చిన్నం బాలవిజయరావు, గ్రామ జనసేనపార్టీ కమిటీ అధ్యక్షుడు అక్కిశెట్టి ప్రసాద్, అక్కిశెట్టి పెద్ద, అరిగెల సూరిబాబు, మండల జనసేనపార్టీ యువజన పార్టీ అధ్యక్షుడు సుంకర వెంకటస్వామి నాయడు, మైపాల తాతాజీ, మట్టపర్తి సోమేశ్వరరావు, సాకా బాబూజీ, వంగా చిన్నా, గంగుల అన్నవరం, వీరా రవి, చింతపల్లి సితారామ ప్రసాద్, ములపర్తి రమేష్, బండారు అబ్బులు, కొప్పిశెట్టి యుగంధర్, కోప్పినీడి సాయిసూర్య, యర్రశెట్టి నాగేందర్, నేదునూరి వెంకటరమణ, గ్రామ శాఖ అధ్యక్షలు అరిగేల బుజ్జి, గోలకోటి నరేష్, బొరుసు రాజా, వక్కపట్ల సుబ్రమణ్యం, వక్కపట్ల అదిత్య, నూకపేయ్యి సూర్యచంద్రర్రావు, జనసేనపార్టీ పి.గన్నవరం మండల అధ్యక్షులు సాధనాల శ్రీనివాస్ (జేడి), నక్క నరేష్, తటికాయల శ్రీనివాస్, అదిమూల సూరయ్య కాపు, వాసంశెట్టి శ్రీనివాస్, ఆకుల సూరిబాబు, మోటూరి చిన్నా, ఆకుల దొరబాబు, రంకిరెడ్డి వీర్రాజు, సుంకర రాంబాబు, సుంకర రాజారావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు 'వికాస'లో జాబ్‌మేళా

**కాకినాడ, మేజర్ న్యూస్ :** "వికాస" కార్యాలయంలో ఈ నెల 23వ తేదీ శుక్రవారం "హెచ్.డి.ఎఫ్.సి (హెచ్.డి.బి) కంపెనీలో బిజినెస్ ఎగ్జిక్యూటివ్, రిలేషన్‌షిప్ మేనేజర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని వికాస కాకినాడ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ ఉద్యోగాలకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన 35సం॥లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.13,000 జీతం + ఇన్సెంటివ్స్, ఇన్సూరెన్స్ + మెడికల్ బోనస్ కల్పించబడునన్నారు. ఆసక్తి గల అభ్యర్థులందరూ ఈ నెల 23వ తేదీ శుక్రవారం "వికాస కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడ" వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్ జెరాక్సులతో హాజరవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్:7799376333, www.vikasajobs.com సంప్రదించాలని వికాస కాకినాడ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు తెలియజేశారు.

## పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలి





**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఇంటర్మీడియేట్, పదవ తరగతి పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యన్నారాయణ, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌తో కలిసి జిల్లా కలెక్టర్లు, జిల్లా విద్యాశాఖాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ నెల 27 నుండి టెట్, డిఎస్‌ఈ పరీక్షలు, మార్చి 1 నుండి ఇంటర్మీడియేట్ పరీక్షలు, మార్చి 18 నుండి పదవ తరగతి పరీక్షలు నిర్వహణకు చేపట్టవలసిన ఏర్పాట్లపై మంత్రి జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ డా.కృతికా శుక్లా పాల్గొని జిల్లాలో ఈ పరీక్షల నిర్వహణకు చేపట్టిన కార్యాచరణను ఆయనకు వివరించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో పరీక్షల నిర్వహణ అంశాలపై సమీక్షించి ఆదేశాలు జారీ చేసారు. ప్రశ్నా, జవాబు పత్రాల భద్రత, పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఫర్నిచర్, లైటింగ్, త్రాగునీరు, ప్రథమ చికిత్స వంటి సౌకర్యాలు, పరీక్షా సమయాల్లో సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు, జెరాక్స్ సెంటర్ల మూసివేత, పరీక్షా కేంద్రాల్లో సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్ల వాడకంపై నిషేధం తదితర అంశాలను పటిష్టంగా అమలు చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. పరీక్షా సమయాల్లో అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు అనువుగా అన్ని పరీక్షా కేంద్రాల రూట్లలో ఎక్కువ సంఖ్యలో బస్సు సర్వీలు ఏర్పాటుకు ఆర్టిసి అధికారులను కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పే నాయక్, విద్యాశాఖ ఆర్.జె.డి. జి.నాగమణి, డిఈఓ పిల్లి రమేష్, ఆర్టిసి ఆర్ఎం శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వైయస్సార్ ప్రభుత్వ హయాంలో కుదేలైన నిర్మాణరంగం



**– రోడ్డున పడ్డ కార్మికులు**
**– భారతీయ జనతా పార్టీ నగర కన్వీనర్ గట్టి సత్యనారాయణ**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** 2019లో రాష్ట్రంలో వైయస్సార్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నిర్మాణరంగం కుదిలైందని నిర్మాణరంగ కార్మికులు రోడ్డున పడ్డారని భారతీయ జనతా పార్టీ నగర కన్వీనర్ గట్టి సత్యనారాయణ మండిపడ్డారు. ప్రజాపోరు యాత్ర రెండవ రోజు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాపోరు యాత్ర రథం రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం ఏడున్నర గంటలకు స్థానిక కొండయ్య పాలెం, శారదా దేవి గుడి, రేచర్ల పేట రైతు బజార్ పర్యటించింది.

ఈ సందర్భంగా స్థానిక శారదా దేవి గుడి వద్ద ఉన్న వందలాదిమంది భవన నిర్మాణ కార్మికులను ఉద్దేశించి భారతీయ జనతా పార్టీ నగర కన్వీనర్ గట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఒక ట్రాక్టర్ ఇసుక ధర 3500 నుంచి 4000 రూపాయలు ఉండేదని 2019 వ సంవత్సరంలో ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అదే ట్రాక్టర్ ఇసుక ధర 6000 నుంచి 6500 అమ్ముతోందని ఫలితంగా సొంతిల్లు నిర్మించుకోవాలనుకునే మధ్య తరగతి ప్రజలు వారి ఆకాంక్షను కలలను వాయిదా వేసుకుంటున్నారని, ఫలితంగా భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డును పడ్డారని వైఎస్ఆర్సిపి ప్రభుత్వాన్ని తీవ్రంగా దుయ్యబట్టారు. రోజు ఉదయాన్నే కూలి పని కోసం గ్రామ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలస వస్తున్నారని, పట్టణాల్లో సైతం పనులు దొరకకపోవడంతో దిక్కుతోచని స్థితిలో భార్యాబిడ్డలకు రోజుకు ఒక పూట కూడా తిండి పెట్టలేక నిర్మాణరంగ కార్మికులు ఈ ప్రభుత్వాన్ని అనునిత్యం శపిస్తూనే ఉన్నారని అన్నారు.

ఇసుక దందాకు రాష్ట్రంలో ఉన్నటువంటి మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు రింగు లీడర్‌గా ఉన్నారని ఆయన తీవ్రంగా ఈ ప్రభుత్వాన్ని విమర్శించారు.అనంతరం భారతీయ జనతా పార్టీ మీడియా ప్యానలిస్టు దువ్వూరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వైయస్సార్ పార్టీ సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని దశలవారీగా అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిందని, అయితే 2019 కి ముందు 50 రూపాయలు ఉండే ఒక క్వార్టర్ బాటిల్ రేటును నేడు 150 రూపాయలు చేసి కార్మికుల పేదవాళ్ల రక్తాన్ని తాగుతోందని అన్నారు ఈ చీప్ లిక్కర్ తాగడం వల్ల పేదవాడి ఆరోగ్యం గుల్లవుతోందని దువ్వూరి వాపోయారు. వెయ్యి రూపాయలు దాటిన కార్పొరేట్ వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని వాగ్దానం చేసిన వైఎస్ఆర్సిపి పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజారోగ్యాన్ని సైతం గాలికి వదిలేసిందని, కార్పొరేట్ హాస్పిటల్లో వైద్యులు ఆరోగ్యశ్రీ పథకం మీద వైద్యాన్ని చేయడానికి నిరాకరిస్తున్నారని దువ్వూరి ఆరోపించారు. కార్పొరేట్ హాస్పిటల్స్‌కు ప్రభుత్వం సుమారు 1000 కోట్ల రూపాయలు బకాయిలు ఉండటమే అందుకు కారణమని దువ్వూరి అన్నారు.

ప్రజా పోరుయాత్ర నగర కన్వీనర్ మసలగంటి సురేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఒక వ్యక్తికి ఐదు కేజీల బియ్యం చొప్పున కుటుంబానికి 25 కేజీల బియ్యం ఇస్తోందని, దీని కారణంగా పేదవాడు ఒక పూటైనా అన్నం తినగలుగుతున్నాడని, ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశానికి ఎగబాకితే పేదవాడి ఆదాయం పాతాళానికి పడిపోయిందని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో సాలిగ్రామ లక్ష్మీ ప్రసన్న, ఏడిద కృష్ణ, చెక్క రమేష్,ర్యాలీ నాగేశ్వరరావు, పుణ్యపు రంగనాథ్, కొండేటి గంగాధర్, గూటూరు పద్మ, గుండోజు బానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 25న రాజమండ్రి బ్రీడ్స్ డాగ్ షో ఛాంపియన్ షిప్ పోటీలు

**– జంతు ప్రేమికులకు రాజమహేంద్రవరంలో మొట్టమొదటిసారిగా డాగ్ షో చాంపియన్ షిప్ పోటీలు**




**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** జంతు ప్రేమికులు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న డాగ్ షో పోటీలు ఈనెల 25వ తేదీ నుంచి రాజమహేంద్రవరంలో ప్రారంభమవుతాయని బౌ అండ్ వావ్ షోరూం నిర్వాహకులు తరుణ్ తెలిపారు. గురువారం రాజమహేంద్రవరం జేఎన్ రోడ్ లోని ఐరన్ గ్రిల్ ఎదురుగా ఉన్న దారా గ్రౌండ్స్ లో రాజమహేంద్రవరం బ్రీడ్స్ చాంపియన్ షిప్ డాగ్ షో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని మెట్రో సిటీస్లను ఈ డాగ్ షోలు నిర్వహిస్తున్నారని అయితే రాజమహేంద్రవరంలో ఎందుకు నిర్వహించకూడదని ఉద్దేశంతో ఈ డాగ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత 25 సంవత్సరాల నుంచి రాజమహేంద్రవరం లో డాగ్ షో నిర్వహించలేదని, అయితే బౌ అండ్ వావ్ సంస్థ ద్వారా నిర్వహించాలని ఉద్దేశంతో బయటకు వచ్చామని వివరించారు. ఫిబ్రవరి 25న నిర్వహించబోయే డాగ్ షో పోటీలలో వందకు పైగా రిజిస్ట్రేషన్లు జరిగాయని వివరించారు. ఒరిస్సా రాష్ట్రం నుంచి భీమవరం, విజయవాడ, విశాఖపట్నం, తదితర మెట్రో సిటీ నుంచి కూడా రిజిస్ట్రేషన్ జరిగాయని తెలిపారు. సింగిల్ డాగ్ తో పాటు ఇద్దరికీ ప్రవేశం ఉంటుందని తెలిపారు. ఏదో సంపాదించాలని వ్యాపార దృక్పథంతో కాకుండా డాగ్ షో ద్వారా వచ్చే ఆదాయాన్ని రాజమహేంద్రవరంలో వీధుల్లో సుమారు 20 వేలు వీధి డాగ్స్ తిరుగుతున్నాయని వాటిలో కొన్ని ప్రమాదాల బారినపడి కాళ్లు విరగ్గొట్టుకుంటున్నాయని, కొన్ని డాగ్స్ చర్మవ్యాధులతో బాధపడుతున్నాయని వీటికి చికిత్స అందించేందుకు ఈ డాగ్ షో ద్వారా వచ్చే నిధులు ఖర్చు చేస్తామని వివరించారు. ఫిబ్రవరి 25వ తేదీన నిర్వహించబోయే డాగ్ షోలో డాగ్స్ లో వివిధ రకాల స్టాల్స్ తో పాటు డాగ్స్ కు సంబంధించిన ఫుడ్ ఐటమ్స్ డ్రెస్ మెటీరియల్స్ ఇతర స్టాల్స్ కూడా ఉంటాయని తెలిపారు. డాగ్స్ కు అత్యవసర చికిత్స అందించేందుకు జంతు సంబంధిత వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ డాగ్ జడ్జిగా దినేష్ గౌడ్ వ్యవహరిస్తారని తెలిపారు.ఈ డాగ్స్ షోలో పాల్గొనేవారు ఫిబ్రవరి 24వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు రిజిస్ట్రేషన్ ల కొరకు ఫోన్ 8555845656. 8500845656. 7981888191. నంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ డాగ్ షో నిర్వహణకు స్వచ్ఛంద సంస్థలతో పాటు పీజీ వెంచర్స్, ఎస్ యు బి నిధి లిమిటెడ్, ప్రోఫిడ్ జెనిక్స్ తదితర సంస్థలు స్పాన్సర్స్ చేస్తున్నాయని వివరించారు.విలేకర్ల సమావేశంలో బౌ అండ్ వావ్ సంస్థ నిర్వాహకులు, ఈవెంట్ ఆర్గనైజర్ ఆర్ జె వై గణేష్, ఆర్సి స్టూడియో అధినేత చింతా రాజు, ఎన్ కాంటెడ్ కేఫీ అధినేత దివ్య, శ్రీనివాస్, అవినాష్, దినేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడ జిల్లా కేంద్రంలో..

## ట్రాఫిక్ అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేయాలి

**– జిల్లా ఎస్పి చర్యలు వహించాలి – పౌర సంక్షేమ సంఘం**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేయాలని పౌరసంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. పూర్వ ఎమ్మెల్యే ముత్తా గోపాలకృష్ణ హయాంలో ఉమ్మడి జిల్లా ఎస్పి వినయ రంజన్ రే తరువాత ట్రాఫిక్ సలహా సంఘం లేకుండా కొనసాగుతున్నదన్నారు. ఆర్ అండ్ బి మున్సిపల్ కార్పోరేషన్ ట్రాన్స్‌కో, ఆర్‌టిఓ, ఆర్‌టిసి, రెవిన్యూ, టెలికాం మున్నగు శాఖల అధికారులతో బాటుగా వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ నుండి ప్రతినిధులను సభ్యులుగా తీసుకుని నగర ట్రాఫిక్ సమావేశం నిర్వహించేవారని పౌరసంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణ రాజు తెలిపారు. నగర విస్తరణ లేకపోవడం వలన ట్రాఫిక్ వెతలు పెరగడం, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది సంఖ్య తక్కువ కావడం, ప్రధాన కూడళ్లలో ఆధునిక సాంకేతిక ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు లేకపోవడం, స్మార్ట్ సిటీ కమాండింగ్ సెంటర్ కుంటుపడడం, జాతీయ రాష్ట్ర రహదారుల్లో స్పీడ్ బ్రేకర్స్ అవసరాలు గుర్తించకపోవడం, ట్రాఫిక్ రహదారుల్లో హైమాస్ట్ దీపాల ఏర్పాటు పెరగకపోవడం, టూవీలర్స్ పార్కింగ్ జోన్స్, కార్ల పార్కింగ్ నిర్వహణకు ఆధునిక నిర్మాణ సౌకర్యాలు కల్పించకపోవడం, బస్ స్టాప్ షెల్టర్స్ ప్రయాణీకులకు అందుబాటులో లేకపోవడం, ఆటోలు, కార్లు, వ్యాన్లు, లారీలు, ట్యాంకర్లు నిలిపేందుకు శాశ్వత ప్రదేశాలు కేటాయించకపోవడం, రోడ్ల విస్తరణ.. వన్ వే.. ఇరుకు రహదారుల్లో రెండులైన్ల మార్గాలు.. అడ్డగోలుగా డివైడర్స్ ఏర్పాటు వంటి వెతలతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న దుస్తితి ఎక్కువయ్యిందన్నారు. ప్రజాసంఘాల, రాజకీయ పార్టీల, స్వచ్ఛంద సంస్థల, వాణిజ్య సంఘాల సలహా సూచనల ప్రమేయం లేకుండా ఏకపక్షమైన ట్రాఫిక్ అమలు వలన సమస్యలతో బాటుగా ప్రభుత్వ నిధులతో వివిధ శాఖల ద్వారా ప్రజల సహకారంతో జరగాల్సిన అభివృద్ధి పనులు ట్రాఫిక్ మెరుగుదలకు లభించడం లేదన్నారు. జిల్లా ఎస్పి స్మార్ట్ సిటీకి ట్రాఫిక్ అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చర్యలు వహిస్తే మేలు జరుగుతుందన్నారు.



## బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ సహకరించాలి

– తహశీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్

**వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ :** బాల్య వివాహాల,నిర్మూలనకు అందరూ సహకరించాలని వరరామచంద్రాపురం తహశీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్,కోరారు.గురువారం ఎం.పి.డి.ఓ.కార్యాలయంలో తహశీల్దార్, సయ్యద్ మౌలానా ఫాజిల్,అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా తహశీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్,మాట్లాడుతూ బాల్య వివాహాలపై ప్రతీ ఒక్కరూ బాధ్యతతో చాలా సున్నితంగా వ్యవరించాలని,సూచించారు. బాల్యం చాలావిలువైనది,చాలా సున్నితమైనదని,ఆయన అన్నారు.బాల్యంలో వివాహాలు చేస్తే నేరమని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.ఖచ్చితంగా భాధ్యత కలిగిన "ప్రతీశాఖ" బాల్యవివాహాలు విషయంలో కాంప్రమైజ్ కావద్దని కోరారు.బాల్య వివాహాల విషయంలోప్రజల్ని కూడా ఖచ్చితంగా భాగస్వామ్యం చేయాలని, నిర్మూలనకు సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఐ.సి.డి.ఎస్.ఇబ్బంది, పోలీస్ శాఖ, ఎం.పి.డి.ఓ.స్టాఫ్,మరియు పాస్టర్లు,ఇమామ్లు,పురోహితులు, తదితరులు హాజరయ్యారు.

# జాబ్ మేళా




-నిరుద్యోగులకు శుభవార్త

**వి.ఆర్.పురం,మేజర్న్యూస్:** నిరుద్యోగులకు శుభవార్త,ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏ.పి.ఎస్.ఎస్.డి.సి) (ఏ.పి.టి.డబ్ల్యు.ఆర్.) సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ మేళా కార్యక్రమం చింతూరు మండల కేంద్రంలోని ఎర్రంపేట స్కూల్ నందు నిర్వహించబడుతుందని వరరామచంద్రాపురం తహశీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్, పత్రికా ప్రకటనలో తెలియజేశారు. గురువారం తహశీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్,మాట్లాడుతూ ఆశక్తి ఉన్న ప్రతీ ఒక్కరూ ఈనెల 27 తారీకున డిగ్రీ ప్రొవిజినల్ సర్టిఫికేట్,ఇంటర్ మార్కులు మెమో,ఎస్.ఎస్.సి.మెమో,స్టడీ సర్టిఫికెట్,ఆధార్ కార్డు,ఆధార్ లింకేజ్ మొబైల్ నెంబర్,తో హాజరుకావాలని ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ ఉపయోగించుకోవాలనిఆయన కోరారు.

# కళ్ళునూరు గ్రామంలో పట్టి పీడిస్తున్న రేషన్ సమస్య

– రేషన్ బియ్యం ఇతరత్ర నిత్యావసర సామాగ్రి ట్రాక్టర్పై తీసుకువెళ్లి అందించాలని డిమాండ్

– పోలవరం ప్రాజెక్టు శాపంగా మారిందని కొండరెడ్డి గిరిజనుల ఆరోపణలు

– జనసేన మండల అధ్యక్షులు ములకాల సాయి కృష్ణ

**వి.ఆర్.పురం, మేజర్న్యూస్ :** కళ్ళునూరులోగ్రామంలో కొండరెడ్డి గిజనులకు అందించే రేషన్ బియ్యం,ఇతరత్ర నిత్యావసర సరుకుల విషయంలో అనేక సమస్యలు సృష్టించబడుతున్నాయని, వరరామ చంద్రాపురం,మండల కేంద్రానికి పట్టుని పది(10 )కిలోమీటర్ల దూరం కూడా లేని ఈగ్రామానికి కనీస రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయకపోవడం విడ్డూరంగా ఉందని జనసేనపార్టీ,మండల అధ్యక్షులు ములకాల సాయి కృష్ణ ,ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.గురువారం, కళ్ళునూరుగ్రామానికి వెళ్లి ఏజెన్సీ కొండరెడ్ల గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐ.టి.డి.ఏ.వారి కోసమే!కానీ రోడ్డు నిర్మాణం చేయరు.రోగం వస్తే ఏలా!ధవాఖానాకు వెల్లెలోపు ఏం జరుగుతోందో అధికారులకు,ప్రభుత్వానికి తెలియదాని, ఆయన ప్రశ్నించారు. కొండ రెడ్డి గిరిజనులు అంటే అంత చులకనాని! ఆవేదన వ్యక్తంచేశారు.కొండరెడ్డి గిరిజనుల కోసం రోడ్డు సౌకర్యంతో పాటు హెల్త్ సెంటర్ కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.లేదంటే రోడ్డు ఏర్పాటుకు ప్రభుత్వం సహకరించాలని సూచించారు. బియ్యం కోసం నాటు పడవలను ఆశ్రయించాల్సి వస్తోందని, ఒక్కొక్కరికి 300/– రూపాయల ఖర్చు వస్తుందని."కూలి" పనిమానేసి బియ్యం కోసం వెళ్లాలని,ఇది ఎంతవరకు సమంజసం మని ఆయన అన్నారు.నాటు పడవల్లో ఏదైనా ప్రమాదం జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఆయన చెప్పారు. పోలవరం ప్రాజెక్టు,నిర్మాణం చేసేవరకు కొండ రెడ్డి గిరిజనులకు యధావిధిగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలని,అధికారులకు,ప్రభుత్వానికి,విజ్ఞప్తి చేశారు. కళ్ళునూరు గ్రామంలో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవని ఆయన తెలిపారు.లేదంటే పోలవరం నిర్వాసితులకు



ఇవ్వాల్సిన,ఆర్%ఆర్,పెండింగులో ఉన్న సమస్యలు పరిష్కరించి ఆర్& ఆర్ కాలనీల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటుచేసి, పట్టాలు ఇచ్చి,విద్యుత్ సౌకర్యం, రోడ్లు,ఏర్పాటుచేసి, డ్రైనేజీ సౌకర్యం, తరలిస్తే మంచిదని,లేకుంటే కొండరెడ్ల సమస్యలపై,గ్రామాల అభివృద్ధి పై పోరాటం చేస్తామని హెచ్చరించారు. జీడిగుప్ప,రాయిగూడెం, ఇసునూరు, కళునూరు,గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.ఈ పర్యటనలో మండల కార్యదర్శి కెచ్చిల పోసిరెడ్డి,నాయకులు కోట్ల రాజిరెడ్డి,మండల యూత్ నాయకులు పెదపెట్ల పవన్ కళ్యాణ్, అందెల కృష్ణారెడ్డి,కథల గణేష్ రెడ్డి, అందెల కన్నప రెడ్డి,కనుగుల వెంకటరెడ్డి,వల్ల రవీంధర్ రెడ్డి,కనుగుల సత్యనారాయణ రెడ్డి,కనుగుల సుధాకర్ రెడ్డి,వాళ్ళ భూసురెడ్డి,వల్ల సాగర్ రెడ్డి,కథల శ్రీనివాస రెడ్డి,వినోద్ కుమార్ రెడ్డి,మనోహర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి,పాల్గొన్నారు.

## యువతి యువకులు ఉద్యోగ అవకాశాల్ని సద్వినియోగపర్చుకోవాలి

– చింతూరు ఐటీడీఏ పీవో కావూరు చైతన్య



**చింతూరు, మేజర్ న్యూస్ :** చింతూరు మండల కేంద్రంలోని గురువారం ఐటీడీఏ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్డిసి) ఆధ్వర్యంలో ఎపిటిడబ్ల్యూఆర్ (బాయ్స్ ) స్కూల్ నందు ఈనెల 27వ తేదీన మంగళవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం మూడు గంటల వరకు 8 కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య తెలియజేశారు. ఈ జాబ్ మేళాలో మదర్ ఫాదర్ కేర్ హెూం నర్సింగ్ సర్వీసెస్, ముత్తూడు ఫైనాన్స్, మెడిప్లస్ ఫార్మసీ, అపోలో ఫార్మసీ, వరుణ్ మోటార్స్, పేటీఎం, నవత రోడ్డు ట్రాన్స్పోర్ట్, మరియు ఆస్ట్రోటెక్ స్టీల్, అనేక కంపెనీలు పాల్గొంటున్నాయి అని అన్నారు. చింతూరు డివిజన్లో18 సం నుండి 35 సంవత్సరాలు మధ్య గల పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ ఆపై చదువు పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూలో ఎంపిక బడిన అభ్యర్థులకు నెలకు రూ.10,000ల నుండి రూ.25,000ల వరకు ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. ఈ సదవకాశాన్ని డివిజన్లో నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగపరుచుకోవాలని ఆయన తెలిపారు. వివరాలు తెలుసుకునేందుకు www.skilluniverse.apssdc.in లేదా 918333046514 సంప్రదించవలసినదిగా ఆయన కోరారు.

## 24 నుండి సామర్లకోటలో ఖో- ఖో ఛాంపియన్ షిప్



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** వైయస్సార్ మెమోరియల్ 56వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల సీనియర్స్ ఖో–ఖో ఛాంపియన్ షిప్ ( పురుషులు,స్త్రీలు) పోటీలను 24 శనివారం నుండి 26 సోమవారం వరకు సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి కె.పట్టాభి రామమ్ తెలిపారు.గురువారం టోర్నమెంట్ నిర్వాహకులతో కలిసి ఆయన మాట్లాడుతూ సుమారు 24 సంవత్సరాల తరువాత సామర్లకోటలో ఆంధ్ర ప్రదేశ్ ఖోఖో ఛాంపియన్ షిప్ పోటీలను నిర్వహించడం జరుగుతుందని 2000 సంవత్సరం లో బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ పాటశాల అవరణలో నిర్వహించడం జరిగిందన్నారు.ఈ పోటీలకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములోని 13 ఉమ్మడి జిల్లాల నుండి సుమారు 450 మంది ఈ పోటీలలో పాల్గొనడం జరుగుతుందని,వారికి కావలసిన వసతి సౌకర్యాలను కల్పించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ పోటీలు డే అండ్ నైట్ పద్దతిలో నిర్వహించనున్నారు. టోర్నమెంట్ నిర్వహణ అధ్యక్షులు మరియు మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్ సూచనలతో క్రీడా పోటీలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని,పెద్దాపురం నియోజక వర్గ వైసిపి పార్టీ ఇంచార్జ్ దవులూరి దొరబాబు,కాకినాడ ఎంపి వంగా గీతా విశ్వనాథ్ మరియు చలమలశెట్టి సునీల్ సహకారంతో ఈ ఖో ఖో పోటీలను నిర్వహించనున్నట్లు టోర్నమెంట్. నిర్వాహకులు ఊబా కెనడీ,పాలికి కుసుమ చంటి బాబులు పేర్కొన్నారు.మూడు రోజులు పాటు జరిగే ఈ ఖో ఖో పోటీలను నిర్వహించనుండగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఖో ఖో కార్యదర్శి ఎం.సీతారామ రెడ్డి,జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డి.వీరభద్ర రెడ్డి,కార్యదర్శి జి.ఎలీషా లు, డి.ఎస్. డి. వో లు హాజరవడం జరుగుతుందన్నారు.

## జాతీయ రహదారి విస్తరణలో ఇల్లు, షాపులు కోల్పోయిన బాధితులు

– జడ్డంగిలో నిరసన ధర్నా



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** ఎన్ హెచ్ 5ఈ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా మండలంలోని నివాసపు ఇల్లు, షాపులు కోల్పోయిన బాధితులకు నేటికీ నష్టపరిహారం చెల్లించ లేదంటూ జడ్డంగి గ్రామంలో గురువారం ఉదయం నిరసన ధర్నా కార్యక్రమం చేపట్టారు. గ్రామ పెద్దలు సింగిరెడ్డి రామకృష్ణ, గణజాల తాతా రావు, గ్రామ సర్పంచ్ కొంగర మురళీకృష్ణ ఆధ్వర్యంలో బాధితులు రోడ్డుపై గంటపాటు ఆందోళన చేపట్టారు. మరో రెండు గంటల పాటు రోడ్డుకు అడ్డంగా ఉండి రోడ్డు కాంట్రాక్టర్ వాహనాలు నిలుపుదల చేసిరాస్తారోకో నిర్వహించారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయ డిప్యూటీ తాసిల్దార్ శ్రీధర్ ఆందోళన కారులు వద్దకు వచ్చి సమస్యను 20 రోజుల్లో పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానన్నారు. ఇళ్ళు, షాప్స్ కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం 45రోజుల్లో చెల్లిస్తామని 2023 జూన్ 30న బాధితులకు మాటిచ్చి సుమారు 8నెలలు కావస్తున్నా నేటికి చెల్లించకపోవడం.. రోడ్డు విస్తరణలో తొలగించిన త్రాగునీటి బోర్లు,వాటర్ పైప్ లైన్ లు వెంటనే పునరుద్ధరించాలని,త్రాగునీటి సమస్య పరిష్కరించాలని,ఎన్ హెచ్5ఈ రోడ్డు కు వీధి రోడ్డు లకు అప్రోచ్ రోడ్ లు వెంటనే నిర్మించాలని,భూములు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని గ్రామ పెద్దలు సింగిరెడ్డి రామకృష్ణ, గణజాల తాతారావు, కొంగర మురళీకృష్ణ లు అధికారులకు వివరించారు. స్థానిక తాసిల్దార్ డివి సత్యనారాయణ, డిప్యూటీ తాసిల్దార్ అల్లు సత్యనారాయణ సమక్షంలో 20 రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హైవే డిటి శ్రీధర్ హామీ ఇవ్వడం జరిగింది. స్థానిక సీఐ సన్యాసినాయుడు ఆధ్వర్యంలోఎస్సై రఘునాథరావు నేతృత్వంలో ఇంటిలిజెంట్ హెచ్ సి దుర్గారావు,పోలీసులు ట్రాఫిక్ కు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో జడ్పిటిసి జ్యోతి, కామేష్, వాసంశెట్టి గంగాధర్, చిన్న, మహిళలు,ఉన్నారు.

## సత్యదేవుని సన్నిధిలో ఘనంగా సరస్వతి పూజలు

– జ్యోతి ప్రజ్వలన చేసిన ఈవో దంపతులు



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి సన్నిధిలో ఘనంగా సరస్వతి దేవి పూజలు నిర్వహించారు. ముందుగా దేవస్థానం కార్యనిర్వహణ అధికారి కె.రామచంద్రమోహన్ దంపతులు జ్యోతి ప్రజ్వలన జేశారు. ఆలయ అర్చకులు శ్రీ స్వామి అమ్మవార్లను శ్రీ స్వామివారి కళ్యాణ మండపం వద్దకు తోడుకుని వచ్చి మండపంపై ఉన్న సింహాసనంపై ఆసీనులు గావించి సరస్వతిదేవి అమ్మవారిని సింహాసనంపై ఆశీనులు గావించి విఘ్నేశ్వర పూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి ప్రతి సంవత్సరం పబ్లిక్ పరీక్షల ముందు విద్యార్థినీవిద్యార్థులుచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి దగ్గర పూజలో ఉంచిన పెన్నులు, కంకణములు, ఈవో రామచంద్ర మోహన్ విద్యార్థిని, విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక శ్రీ సత్యదేవా జూనియర్ కళాశాల మరియు డిగ్రీ కళాశాలల విద్యార్థిని, విద్యార్థులు, కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

## షర్మిల అరెస్టును ఖండించిన మాజీ అధ్యక్షులు ఎండి రఫీ ఉల్లా బేగ్




**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** ఏపీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి చలో సచివాలయం ముట్టడి కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఆమెను విజయవాడలో పార్టీ కార్యాలయం వద్ద ఆమెతో పాటు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అరెస్ట్ చేయడం పట్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఎండి రఫీ ఉల్లా బేగ్ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం నాడు కొవ్వూరు మండలం కాపవరం గ్రామంలో రఫీ ఇంటి వద్ద ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ నెంబర్ అమర్జహ బేగ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అమర్జహబేగ్ మాట్లాడుతూ దగ డిఎస్సి వద్దు మెగా డీఎస్సీ కావాలని అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు ఇస్తానని నిరుద్యోగులను మోసం చేసిందని అన్నారు. రాష్ట్రంలో 30 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్న కేవలం 6000 ఉద్యోగాలకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో నిరుద్యోగ యువత,యువకులు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మోత శారద, కలగర హరిబాబు, పుల్లారావు, మట్ట సుబ్బారావు, కొడమచర్ల చంద్రశేఖర్,కే. సురేష్, అబ్దుల్ బాదుషా తదితరులు పాల్గొన్నారు.

## వెంకన్న హుండీ ఆదాయం రూ.91 లక్షలు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 29 రోజులు కాలానికి రూ.91,05,373లు, బంగారం 57 గ్రాములు, వెండి 900 గ్రాములు, పలు దేశాలకు చెందిన విదేశీ కరెన్సీ నోట్లు, క్షేత్రపాలకుడు విశ్వేశ్వర స్వామివారి హుండీ ఆదాయం రూ.1,55,674 లు సమకూరింది. ఈ లెక్కింపు కార్యక్రమంలో చైర్మన్ రుద్రరాజు రమేష్రాజు, డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిరణ్ కుమార్, పర్యవేక్షణాధికారి అసిస్టెంట్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, ఈవోలు ఎం.రాధాకృష్ణ, బి.కిరణ్, బి.నరేంద్ర కుమార్, కమిటీ సభ్యులు, సిబ్బంది ఉన్నారు.

# సీఎం గారూ.. రుణమాఫీ డబ్బులు ఇవ్వండి

– బటన్ నొక్కి నెలరోజులైనా అందని లబ్ధి



**కాకినాడ, మేజర్న్యూస్ :** ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారులకు లబ్ధి చేకూరుస్తున్నామని సీఎం చెబుతున్నారు. అయితే ముఖ్యమంత్రి బటన్ నొక్కినా ఆర్థికశాఖ దయ చూపకపోవడంతో లబ్ధిదారులకు ఆ మేరకు నిధులు రావడం లేదు.గత నెలలో ముఖ్యమంత్రి జగన్ డ్వాక్రా మహిళల రుణమాఫీకి సంబంధించి జగనన్న చేయూత బటన్ నొక్కారు. అప్పటినుంచి డ్వాక్రా మహిళలు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. డబ్బులు రాలేదని బ్యాంకర్లు చెబుతున్నారు. నెలరోజులు దాటినా రుణమాఫీకి సంబంధించి చేయూత డబ్బులు రాకపోవడంతో మహిళలు ఆగ్రహంగా ఉన్నారు. ఎన్నికలు వచ్చేస్తున్నాయి, డబ్బులు ఎప్పుడు ఇస్తారు అని డిమాండ్ చేస్తున్నారు. వెలుగు ప్రాజెక్ట్ ఏపిఎం, సీసీలను అడిగితే తమకు తెలియదన్నారు. బ్యాంకర్లని అడిగితే డిఆర్డిఏ అధికారులను అడగమంటున్నారు. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా మహిళలు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం బటన్ నొక్కుతున్నారు, డబ్బులు రావడం లేదంటూ ఆరోపణలు చేస్తున్నారు. చిరువ్యాపారులకు జగనన్న తోడు పథకంలో వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నారు.

ఈ సహాయానికి సంబంధించి తోడు పథకం డబ్బులు కూడా ఇవ్వడం లేదని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. చిరు వ్యాపారులకు పదివేల రూపాయల రుణం బ్యాంకర్లు ఇస్తారు. ఆ వడ్డీని ప్రభుత్వం బ్యాంకులకు చెల్లిస్తుంది. దీనికీ సీఎం బటన్ నొక్కారు. కానీ ఇప్పటికీ బ్యాంకర్లు రుణాలు ఇవ్వలేదని చిరువ్యాపారులు చెబుతున్నారు. మార్చి నెల తర్వాత ఇస్తామని బ్యాంకులు చెబుతున్నట్లు డ్వాక్రా అధికారులు అంగీకరించారు. డిఆర్డిఏ నిర్వహిస్తున్న ఈ రెండు పథకాలకు సంబంధించి డబ్బులు రాకపోవడంతో ప్రభుత్వంపై వారంతా గుర్రుగా ఉన్నారు. ఇప్పుడిప్పుడే ఖాతాలకు డబ్బులు వస్తున్నాయని డ్వాక్రా అధికారులు సర్ది చెప్పే ప్రయత్నం చేస్తున్నారు.

# 1వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



కాకినాడ, మేజర్ న్యూస్ : ఉచిత మరియు నిర్బంధ విద్యా హక్కు చట్టం, సెక్షన్ 12 (1) (సి) ఆర్.టి.ఇ 2009 ప్రకారం 2024 –25 విద్యా సంవత్సరానికి ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలలో 25% సీట్లను వారి నివాస సమీప ప్రాంతంలో ఐ.బి./సి.బి.ఎస్.సి/ఐ. సి.ఎస్.ఇ/స్టేట్ సిలబస్ అనుసరిస్తున్న అన్ని ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలలో పిల్లలు తల్లిదండ్రులు 1 వ తరగతి లో ప్రవేశం కొరకు దరఖాస్తు చేసుకోవడానికి తల్లిదండ్రుల ప్రధమిక వివరములతో మరియు జనన ధ్రువీకరణ పత్రం వివరములతో తేది.23.02.2024 నుండి 14.03.2024 వరకు 25% కోటా క్రింద ప్రవేశం పొందదానికి దరఖాస్తులును ప్ట్రిజూ://ఎంవ.ఖజూ.ప్ర్శీజ.అఅ వెబ్ సైట్ నందు రిజిస్టర్ చేసుకోవసినదిగా జిల్లా విద్యాశాఖాధికారి మరియు సమగ్రశిక్ష జిల్లా అదనపు పథక సమన్వయకర్త పిల్లి రమేష్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇప్పటికే జిల్లాలో 459 ప్రైవేటు స్కూళ్ళకు గాను 427 స్కూళ్ళు ఈ ప్రవేశాల కొరకు సి.ఎస్.సి. పోర్టల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకున్నాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు సంబంధిత గ్రామ సచివాలయం, మండల విద్యా వనరుల కేంద్రం మరియు సంబందిత పాఠశాల నుండి కుడా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

అదేవిధంగా, జిల్లాలో గల అందరు మండల విద్యాశాఖాధికారులు పిల్లల ఉచిత మరియు నిర్బంధ విద్యా హక్కు చట్టం–2009 అమలు చేయుట కొరకు సమీప పాటశాలల నందు పిల్లలు తల్లిదండ్రులు 1 వ తరగతి లో ప్రవేశం కొరకు షెడ్యూల్ ప్రకారం పిబ్రవరి 23, 2024 నుంచి మార్చి 14, 2024 వరకు స్టూడెంట్ రిజిస్ట్రేషన్ విండో ఆన్ ది పోర్టల్ నమోదు చేసుకొనుట, మార్చి20, 2024 నుంచి మార్చి 22, 2024 వరకూ స్టూడెంట్ అప్లికేషన్ ఎలిజిబిలిటి డిటెర్మినేషన్ ను గ్రామ సచివాలయం డేటాతో ధ్రువీకరించుట, ఏప్రిల్ 1, 2024 న లాటరి ద్వారా మొదటి విడత జాబితా ప్రచురణ, ఏప్రిల్ 2, 2024 నుంచి ఏప్రిల్ 10, 2024 వరకూ ఆయా పాఠశాలలో స్టూడెంట్స్ అడ్మిషన్లు ధ్రువీకరణ, ఏప్రిల్ 15, 2024 న లాటరి ద్వారా రెండవ విడత జాబితా ప్రచురణ, ఏప్రిల్ 16, 2024 నుంచి ఏప్రిల్ 23, 2024 వరకూ స్టూడెంట్స్ అడ్మిషన్లు ధ్రువీకరణ చేయటం జరుగుతుందని తెలిపారు. అనంతరం, అర్హులైన విద్యార్థులకు లాటరీ ద్వారా సీట్లు కేటాయింపు జరుగుతుందని, ఎంపికైన విద్యార్థుల జాబితా వివరాలను సంబంధిత పాఠశాలలో చూడవచ్చునని, ఇతర వివరములకు సంబంధిత మండల విద్యాశాఖాధికారి లేదా మండల విద్యా వనరుల కేంద్రం సంప్రదించాలని తెలిపారు.

# ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ఘన నివాళి



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల– రాజమహేంద్రవరం కళాశాలలో గురువారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 177 వ వర్ధంతి సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చవాన్ శ్యామరాజ్ నాయక్ ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించి విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు చాలామంది నోళ్ళల్లో నానుతున్న పేరు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఎందుకంటే తొలి స్వాతంత్రయ సమరయోధుడిగా ఆయన్ను కీర్తించారు. బ్రిటిష్ పాలన విధానంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో రైతుల నుంచి కొత్త పన్నులు వసూలు విధానం అమల్లోకి వచ్చినప్పుడు ఆయన చేసిన పోరాటం ఎంతో పటిష్టమైనదని కొనియాడారు ఆయన ఘనత అందరికీ తెలియజేయాలని ఆయన పోరాటాన్ని తక్కువ చేయలేమని విద్యార్థిని విద్యార్థులకు ఉపదేశించారు. ఈ కార్యక్రమం జాతీయ సేవా పథకం అధికారులు డాక్టర్ పి అమ్మాజీ, డాక్టర్ జి రమేష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు మరియు బోధ నేతర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పెద్దాపురం ఎమ్మెల్యేగా నేనే పోటీ చేస్తా.. తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు..



– ఎమ్మెల్యే రాజప్ప

**సామర్లకోట, మేజర్ న్యూస్ :** రానున్న ఎన్నికల్లో పెద్దాపురం ఎమ్మెల్యేగా తానే పోటీ చేస్తానని, తానంటే గిట్టని వారు నాపై తప్పుడు ప్రచారాలు నమ్మవద్దనిపెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప స్పష్టం చేశారు. సామర్లకోట మండలం అచ్చంపేట కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. తన ఆరోగ్యం బాగోలేదని సోషల్ మీడియాలో కొందరు వీడియోలు విడుదల చేయడం దారుణమన్నారు. తనకు సీటు రావడంలో ఎలాంటి డౌట్ లేదని, ఇప్పటికే పలుమార్లు తమ నేత చంద్రబాబు, ఆయన తనయులు లోకేష్ లు తనను ఎన్నికల ప్రచారం చేసుకొమ్మని చెప్పారన్నారు. 2014లో పెద్దాపురం ఎమ్మెల్యే గా గెలుపొంది రూ. వెయ్యికోట్లు అభివృద్ధి చేశానన్నారు. దానిని చూసి ప్రజలు మరలా 2019 లో తనకు మరోమారు అవకాశం ఇవ్వగా నియోజకవర్గం అభివృద్ధి కి పాటు పడుతూ ప్రజల మధ్యలో ఉన్నానన్నారు. అయితే ఈ సారి ఎన్నికల్లో కూడా తనకే పెద్దాపురం టికెట్ ఖరారు అవుతుండగా తనకు ఆరోగ్యం బాగుండటం లేదని, తనకు ఎంపీ టికెట్ ఇస్తున్నారని సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడుతున్నట్టు ఆయన చెప్పారు. ఆ వార్తలు పూర్తిగా అవాస్తావాలని ఆయన స్పష్టం చేశారు. తాను రోజుకు 12 గంటల పాటు పార్టీ లో పనిచేస్తున్నట్టు ఎమ్మెల్యే చెప్పారు. లోకేష్ బాబు కార్యక్రమాల్లో పాల్గొంటు స్థానికంగా నేను అందుబాటులో లేని సమయంలో తన కుమారుడు అయిన రంగనాగ్ నియోజక వర్గ ప్రజలకు అందుబాటులో ఉంటుండగా దానిని విమర్శించడం దారుణమన్నారు. ఏది ఏమైనా అవాస్తావాలను నియోజక వర్గ ప్రజలు నమ్మవద్దని రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే గా పోటీ చేసేది నేనే నని ఎమ్మెల్యే రాజప్ప స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట పార్టీ నాయకులు అడబాల కుమారస్వామి తదితరులు ఉన్నారు.

## ఎంపి వంగా గీత చేతుల మీదుగా ఉత్తమ వాలంటీర్లకు పురస్కారాలు



**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన వాలంటీర్లకు కాకినాడ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ పురస్కారాలు అందజేశారు. గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశానికి ఎంపీ గీత ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా వాలంటీర్లు సేవలందిస్తున్నారని కొనియాడారు. సంక్షేమ పథకాల అమలులో వాలంటీర్లే కీలకమని పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన వివిధ గ్రామాలకు చెందిన వాలంటీర్లకు పురస్కారాలు, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఉలవకాయల లోవరాజు, ఎంపీపీ అరిగెల అచ్చియ్యమ్మ, రామన్న దొర, వైస్ ఎంపీపీ నేమాని ఆది విష్ణు, మాజీ ఎంపీపీ ఉలవకాయల సత్యనారాయణ, ఎంపీటీసీ ఆకుల శ్రీను, వెలుగుల సత్యనారాయణ, కొడవలి సర్పంచ్ బుర్రా నాగచంద్ర, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## మిడ్డే మీల్స్ బియ్యం సకాలంలో అందించాలి

**- ఎం.పి.పి.కారం లక్ష్మీ**



**వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ పాఠశాలల్లో (మధ్యాన భోజనం) మిడ్డే మిల్స్ సంబంధించి బిల్లులు సకాలంలో ఇవ్వాలని ఎం.పి.పి.కారం లక్ష్మీ, అధికారులను డిమాండ్ చేశారు. గురువారం,ఎం.పి.పి.కారం లక్ష్మీ, వరరామచంద్రాపురం,మండల కేంద్రలోని సీతంపేట, మొద్దులగూడెం,శ్రీరామగిరి,చొక్కన పల్లి,గ్రామాల్లో పాఠశాలలను పరిశీలించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మిడ్డే మిల్స్ సంబంధించిన బియ్యం సకాలంలో రాకపోవడంతోమెంటెన్స్ కష్టంగా మారిందని, ఎం.పి.పి.కారం లక్ష్మీ, ముందు సిబ్బందివాపోయారు.ఈ విషయంపై అధికారులు స్పందించి "మిడ్డే మిల్స్"కు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. పైఅధికారులు దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.ఈ పర్యటనలోసి.పి.ఎం.పార్టీ మండల కార్యదర్శి సోయం చిన్నబాబు,సీనియర్ సి.పి.ఎం.పార్టీ నాయకులు పంకు సత్తిబాబు,కమ్మచిచ్చు సత్యనారాయణ, చీరపు తాతబాబు,సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు తమ్ముళ్ల కుమ్ములాట..



**-గోపాలపురం తెదేపాలో రెండు వర్గాలు**
**-ఒక వర్గం మద్దిపాటి వైపు..మరో వర్గం వెంకటేశ్వరరావు వైపు**
**-ఇంకా అయోమయంలోనే అభ్యర్థి ఎంపిక**
**-ఇలా ఐతే ఎన్నికల్లో విజయం ఎలా సాధ్యం..?**
**-దిద్దుబాటు చర్యలు లేకపోతే కంచుకోటకు మరో బీటలు వాలే ప్రమాదం**

**గోపాలపురం, మేజర్ న్యూస్:** గోపాలపురం నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల కుమ్ములాటతో పార్టీ అప్రతిష్ఠపాలవుతోంది. దాదాపు రెండేళ్ల క్రితం ఇన్‌ఛార్జి నియామకం విషయంలో ఏర్పడిన విభేధాలు అంతకంతకు తీవ్రతరం అవుతున్నాయి తప్పా వాటికి అడ్డుకట్ట పడడం లేదు. ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న మద్దిపాటి వెంకటరాజు వర్గం ఒకటైతే...మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు వర్గం మరొకటి.. తెలుగుదేశంపార్టీ కేంద్ర కార్యాలయంలో కీలక బాధ్యతులు నిర్వహిస్తున్నమద్దిపాటి వెంకటరాజుఅనేయువకుణ్ణి సుమారు రెండేళ్ల క్రితం గోపాలపురం ఇన్‌ఛార్జిగా చంద్రబాబు స్వయంగా నియమించారు.ఆ తర్వాత పోలవరం పర్యటనలో భాగంగా దొండపూడి సభలో కూడా వెంకటరాజుపేరునుచంద్రబాబు అధికారికంగా ప్రకటించేశారు. ఈ నిర్ణయం కొంత మంది సీనియర్లకు, మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు వర్గానికి మింగుడు పడలేదు. తమ అభిప్రాయం లేకుండా ఇన్‌ఛార్జులను ప్రకటిస్తే గెలుపు విషయంలో ఎవరు పాత్ర పోషిస్తారు అంటూ భీష్మించుకుని కూర్చున్నారు. ఆ తర్వాత చంద్రబాబు, లోకేష్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నను కూడా కలిసి పరిస్థితిని వివరించి చెప్పడంతో మారుస్తామని చెప్పి తర్వాత మార్చకుండా మద్దిపాటి వెంకటరాజునే ఇన్‌ఛార్జిగా కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో అప్పట్లో వ్యతిరేకించిన నాయకులను పార్టీ అధిష్ఠానం బుజ్జగించే చర్యలు చేపట్టకపోవడంతోఆవిభేధాలుఅలాగే కొనసాగు తున్నాయి.ఈ నియోజకవర్గం అర్థశతాబ్ధం క్రితమే ఏర్పడిరది. 1962 నుంచి గోపాలపురం నియోజవర్గానికి ఎన్నికలు నిర్వహిస్తున్నారు. తొలి నుంచి ఇది ఎస్సీ నియోజకవర్గంగానే ఉంది. 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరిగినా ఎస్సీ నియోజక వర్గంగానే ఉంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు నియోజకవర్గానికి 13 సార్లు సార్వత్రిక ఎన్నికలు నిర్వహించగా అందులో 6 సార్లు కాంగ్రెస్ పార్టీ విజయం సాధించగా తెలుగుదేశం పార్టీ స్థాపించిన నాటి నుంచి ఒక్కసారి మినహా 6సార్లు విజయ దుందుబి మోగించింది. దీంతో తెదేపా కంచుకోటగానే గోపాలపురాన్ని చెబుతారు. ఇలా కొనసాగుతున్న నేపథ్యంలో 2019 ఎన్నికల్లో తెదేపా అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వం్రావుపై వైసీపీ అభ్యర్థి తలారి వెంకట్రావు ఘనవిజయం సాధించారు. దీంతో కంచుకోట బద్దలు కొట్టినట్టే అయ్యింది. మరి తెలుగుదేశం పార్టీలోసరిచేసుకుని కంచుకోటను పునర్నించుకుంటారా..? మళ్లీ బీటలు వాలే పరిస్థితికి తీసుకువస్తారా అనేది వేచిచూడాల్సిన అంశం.

**- అభ్యర్థి ఎంపికపై వీడని సందిగ్ధం...**మద్దిపాటి వెంకట్రాజును గోపాలపురం ఇన్‌ఛార్జిగా నియమించిందన్న మాటే కానీ అప్పటి నుంచి వర్గపోరు..అంతర్గత కలహాలు, గ్రూపురాజకియాలు రాజ్యమేలుతున్నా యి. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. గోపాలపురం పరిస్థితినే తీసుకుంటే సీనియర్ నాయకుల్కెన చదలవాడ ప్రసాద్, ముప్పిడి అశోక్, మేణ్ణి సుధాకర్, జామి సూర్యచంద్రం లాంటి నాయకులు ముప్పిడి వర్గంలో ఉంటే మిగిలిన వారు మద్దిపాటితో ఉన్నారు. అలాగే జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు సైతం ముప్పిడి వర్గంతోనే ఉన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ కేడర్‌లో అయోమయం నెలకొంది. ఈ మధ్య మారిన సమీకరణాల నేపథ్యంలో ఇన్‌ఛార్జిని మారుస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. వైసీపీ నుంచి తానేటి వనిత ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్న నేపథ్యంలో చింతలపూడి నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి పీతల సుజాతను ఇక్కడ నుంచి బరిలో దించుతారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇంకోవైపు ముప్పిడి వెంకటేశ్వరరావును అభ్యర్థిగా ప్రకటిస్తారని కొందరు చెబుతున్నమాట. ఏదిఏమైనా వైసీపీ నుంచి అభ్యర్థి ఎవరు అనేది స్పష్టమైన నేపథ్యంలో తానేటి వనిత ప్రచారం ముమ్మరంగా సాగిస్తున్నారు. తెదేపాలో మాత్రం ఆ క్లారిటీ లేక ప్రచారంపై పెద్దగా దృష్టిసారించని పరిస్థితి నెలకొంది. పార్టీ కేడర్ అంతా ఇప్పుడున్న ఇన్‌ఛార్జి మద్దిపాటికి పూర్తిసహకారం అందించడక పోవడం ఒక అవరోధంగానే చెప్పాలి. ఇప్పటికైనా పార్టీ అధిష్ఠానం దిద్దుబాటు చర్యలు చేపడితేనే ఆశించిన ఫలితం ఉంటోందని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## భవిత కేంద్రం నందు పిల్లలకు ఫిజియోథెరపి సేవలు



పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం పట్టణంలో గల స్థానిక మహాత్మా గాంధి మున్సిపల్ స్కూల్ నందు గల భవిత కేంద్రం నందు గల భవిత కేంద్రం నందు భవిత విద్యార్థులకు ఫిజియోథెరపి సేవలు ఫిజియోథెరపిస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనిలో భాగంగా భవితలో చదువుతున్న పిల్లల యొక్క తల్లితండ్రుల అభిప్రాయాలను విద్యాశాఖాధికారులు తెలుసుకుని, అనంతరం రిజిష్టర్‌ను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయులు బి.దుర్గాప్రసాద్‌రెడ్డి, ఆనందరావు, విద్యార్థులు, తల్లితండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## డి & ఓ ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేస్తే చర్యలు

**- కమీషనర్**



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పురపాలక సంఘ పరిధిలో వివిధ వ్యాపారాలు చేసేవారంతా డి & ఓ ( డేంజరస్ అండ్ అఫెన్సివ్) ట్రేడ్ లైసెన్స్ పొందాలని, లేకుంటే మున్సిపల్ చట్టప్రకారం చర్యలుంటాయని, మున్సిపల్ కమీషనర్ కె.వి.పద్మా వతి తెలిపారు. గురువారం ఆమె స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ పురపాలక సంఘంలో సుమారు 1300 మంది డి & ఓ ట్రేడ్ లైసెన్స్‌దారులు ఉన్నారని, ఇప్పటివరకు డి&ఓ ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా రూ.12, 69,000/-లు వసూలు అయిందని, ఇంకా సుమారు రూ.6,00,000/- లు రావలసి ఉందని ఆమె తెలిపారు. ఫిబ్రవరి 28వ తేది లోపులో ట్రేడ్ లైసెన్సదారులు రెన్యువల్ చేయించుకోవాలని, దాటితే 25శాతం అపరాధ రుసుముతో మార్చ్ 31 వరకు ఉందని, ఏప్రిల్‌లో 50శాతం అపరాధ రుసుముతో చెల్లించవలసి ఉంటుందని కమీషనర్ తెలిపారు. ఈ సమావేశంలో ఆమె వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, తదితరులు ఉన్నారు.

## డాక్టర్ రమేష్ కుకోటి పార్థివలింగ మహా రుద్రాభిషేకానికి ఆహ్వానం పలుకుతున్న మారిశెట్టి భద్రం



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జగ్గంపేట మండలం ఇర్రిపాకలో జ్యోతుల నెహ్రూ కుటుంబం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈనెల 26వ తేదీ నుండి మార్చి ఏడో తేదీ వరకు కోటి పార్థివ లింగ మహా రుద్రాభిషేకం నిర్వహిస్తున్న సంగతి విధితమే ఈ మహా రుద్రాభిషేక ఆహ్వాన పత్రికలు జగ్గంపేట గ్రామంలో ఇంటింటికి తిరిగి పార్టీలకు అతీతంగా కులమతాలకు అతీతంగా ఆహ్వానిస్తున్నారు. అందులో భాగంగా జగ్గంపేట గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యులు జయ నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ రమేష్ ఆహ్వానం అందించిన జగ్గంపేట మండల టిడిపి అధ్యక్షుడు మారిశెట్టి భద్రం ఈ సందర్భంగా భద్రం మాట్లాడుతూ దేశంలో ఒకే చోట ఎక్కడ కోటి మట్టిలింగాలు తయారుచేసి ఒకే చోట మహా కుంభాభిషేకం చేయడం జరగలేదని అటువంటి మహత్తర కార్యక్రమాన్ని జ్యోతుల నెహ్రూ కుటుంబం ఇర్రి పాకలో ఎంతో ప్రతిష్టాత్మక నిర్వహిస్తున్నారని ఈ కార్యక్రమంలో 11 రోజులపాటు ప్రతిరోజు ఏదో ఒక పీఠం నుంచి పీఠాధిపతి వస్తారని భక్తి ప్రవచనాలు, ఆధ్యాత్మిక వేద మంత్రాలతో ఆ ప్రాంతమంతా ఘోషిస్తుందని కులమతాలకు అతీతంగా పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొని ఆ పరమశివుడు కృపకు పాత్రులు అవుతారని గ్రామంలో ప్రతి ఒక్కరిని ఆహ్వానిస్తున్నామని తెలియజేశారు.

## ఫోటో జర్నలిస్టుపై దాడిని ఖండించిన కొవ్వూరు ప్రెస్ క్లబ్



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** అనంతపురం జిల్లా రాప్తాడు గ్రామంలో అధికార పార్టీ నిర్వహించిన సిద్ధం బహిరంగ సభ వార్తను కవర్ చేయడానికి వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ కృష్ణ పై అల్లరి మూకలు చేసిన దాడిని కొవ్వూరు ప్రెస్ క్లబ్ తీవ్రంగా ఖండించింది. శుక్రవారం ఈ దాడిని నిరసిస్తూ నిందితులపై కఠిన చర్యలు చేపట్టాలని కోరుతూ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నల్లా స్వామి నాయుడు ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ్ కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు అమానుషమన్నారు. జర్నలిస్టులకు రక్షణ లేకుండా పోయిందని ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు గంధం పూజ నరసింహ బాపూజీ, అబ్దుల్ సూర్య ప్రకాష్, కె.దేవదాస్, సాయి,అయ్యప్ప, ప్రసాద్, అవినాష్, ఎర్రన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

## రైతులపై కాల్పులు దుర్మార్గం..

**- ఖండించిన రైతుకూలి సంఘాలు**
**- దొండపూడిలో ర్యాలి నిర్వహణ**




**గోపాలపురం,మేజర్ న్యూస్ :** పంజాబ్, హర్యానా రైతులపై జరిగిన కాల్పులను, నిర్బంధాన్ని ఖండిస్తూ రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) ఆధ్వర్యంలో దొండపూడిలో గురువారం నిరసనగా ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కుంజం రామారావు, షేక్ బాషా మాట్లాడుతూ పంజాబ్ హర్యానా రైతులపై కాల్పులు జరిపి ఒక రైతుని బలిగొనడాన్ని తీవ్రంగా ఖండిరచారు. శాంతియుతంగా తమ నిరసనను తెలియజేస్తున్న రైతులపై నిర్బంధకాండను కేంద్ర , హర్యానా ప్రభుత్వాలు సాగించడం అత్యంత దుర్మార్గమన్నారు. రైతాంగానికి మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. ఢల్లీలో శాంతియుతంగా నిరసన చేపట్టేందుకు పాలకులు సహించలేక పోతున్నారని అన్నారు. తక్షణమే ఉత్పాదక ఖర్చులతో పాటు 50 శాతాన్ని కలిపి కనీసం మద్దతు ధరల చట్టాన్ని తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులపై జరుగుతున్న దమనకాండను ప్రజలందరూ ఖండిరచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు సవలం రాంబాబు, రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ముప్పిడి రాజరత్నం తదితరులు నాయకత్వం వహించారు.

## ముగ్గురు విద్యార్థులకు అస్వస్థత

**- ఆసుపత్రిలో విద్యార్థులను పరామర్శించిన ఎంఈవో**
**- ఆరోగ్యంగానే ఉన్నరాన్న వైద్యులు**



**గోపాలపురం, మేజర్ న్యూస్ :** గోపాలపురం మండలంలోని గంగోలు పంచాయతీ పరిధిలోని యర్రవరం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు బుధవారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు. తొలుత స్థానిక హుకుంపేటలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం గోపాలపురం సామాజిక ఆరోగ్యకేంద్రానికి రాత్రికిరాత్రే తీసుకువచ్చారు. మండల విద్యాశాఖ అధికారి జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం విద్యార్థులు మూడు, ఐదవ తరగతులు చదువుతున్నారు. బుధవారం మధ్యాహ్నం పాఠశాలలో భోజనం చేశారు. పాఠశాల అయిన తర్వాత ఇళ్లకు వచ్చారు. రాత్రి 8గంటల సమయంలో వాంతులు, విరేచనాలు అవ్వడంతో ముగ్గురు విద్యార్థులను వారి తల్లిదండ్రులు హుకుంపేట ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గోపాలపురం తరలించారు అని ఎంఈవో తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారి జి.శ్రీనివాసరావు గురువారం పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్యం బాగానే ఉందని వైద్యులు చెప్పారు. దీనికి కారణాలను పరిశీలిస్తున్నట్లు ఎంఈవో తెలిపారు.

## సామర్లకోటలో పెరుగుతున్న పందుల స్వైర విహారం



**సామర్లకోట,మేజర్‌న్యూస్:** సామర్ల కోట పట్టణంలో పగలు రాత్రి తేడా లేకుండా పందుల సంచారం పెరిగిపోయింది. పట్టణంలో పంది లను నివారించేం దుకు అధికారులు ఎన్ని చర్యలు చేపడుతున్నా అవి విఫలమవుతూనేఉన్నాయి.గతంలో పందులను పట్టుకుని అధికారులు దూర ప్రాంతాలకు తరలించిన పందుల పెంపకందారుల్లో మార్పు రావడం లేదు.దీంతో పట్టణంలోని కుమ్మర వీధి,బ్రౌన్ పేట,సీతారామ కాలనీ,గణేష్ కాలనీ,ప్లీడరు గారి వీధి,గాంధీ నగర్,వీరాఘవ పురం తదితర ప్రాంతాల్లో పందుల కారణంగా అపరిశుభ్రత రాజ్యమేలుతోంది.మున్సిపల్ అధికార్లు ఇప్పటి నుంచే పందుల విషయంలో చర్యలు తీసుకోకపోతే రోగాలు ప్రభలే ప్రమాదముందని ప్రజలు వాపోతున్నారు.మరోపక్క పందుల పెంపకందార్లతో మున్సిపల్ అధికార్లు చర్చించి పట్టణ శివారు ప్రాంతాల్లో పందులను సంచరించకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## రు.265 లక్షలతో అంతర్గత రహదారి సంబంధించి ఆరు పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి వేణు

**-రూరల్ నియోజక వర్గాన్ని కాలుష్య రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు శానిటేషన్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం -మంత్రి వేణుగోపాలకృష్ణ**



**కడియం,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని జిల్లా ఇన్చార్జి మంత్రి బీసీ సంక్షేమం సమాచార పౌర సంబంధాలు సినిమా ఆటోగ్రాఫీ శాఖ మంత్రి, రాజమండ్రి నియోజక వర్గ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస్ వేణు గోపాల కృష్ణ పేర్కొన్నారు. గురువారం కడియం ఆకుల సుబ్బారావు నర్సరీ నుండి జాతీయ రహదారి వరకు నిర్మించే సీసీ రహదారి ఆరు పనులకు సంబంధించి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రు.265 లక్షలతో చేపట్టనున్న పనులకు మంత్రి స్థానిక నాయకులు అధికారులతో కలిసి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. కాలుష్య రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు మెరుగైన సానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించి పలు కార్యక్రమా లను నిర్వహిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. రాజమండ్రి రూరల్ నియోజక వర్గంలో రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ, మంచినీటి, పైపులైన్లు, వీధి దీపాల ఏర్పాటు, పార్కుల సుందరీకరణ తదితర మౌలిక వసతుల ఏర్పాటుకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. ప్రతిరోజు గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో స్థానికులను కలిసి సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్ మనోజ్, వైయస్‌ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, వైయస్‌ఆర్సిపి మండల అధ్యక్షులు, జెగురుపాడు సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్, డాక్టర్ అనుసూరి పద్మలత, కడియపులంక సొసైటీ చైర్మన్ తిరుమల శెట్టి శ్రీను, వేమగిరి సొసైటీ చైర్మన్ వెలుగుబంటి అచ్యుతరామ్ , నర్సరీ సంఘం అధ్యక్షులు మల్లు పోలరాజు, మైనార్టీ సెల్ కన్వీనర్ భాషా,స్థానిక నాయకులు దాసరి శ్రీనివాసు నర్సరీ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రంగస్థల నాటకరంగానికి అర్ధశతాబ్ద కాలం నుంచి వెన్నుదన్నుగా నల్లాకులవారిపాలెం

**- బాలనాగమ్మ నాటిక సన్నివేశం**



**పెరవలి, మేజర్‌న్యూస్ :** సాంకేతికతకు దగ్గరై..వ్యక్తిగత సంబంధాలకు దూరమై జీవనం సాగిస్తున్న ఈ కాలంలోనూ ఆ గ్రామములో అనాదిగా వస్తున్న రంగస్థల నాటకాలను ప్రదర్శించే ఆచారాన్ని తూచా తప్పకుండా పాటిస్తున్నారు. ఆలయ ఉత్సవ కమిటీల లో పెద్దలు వెళ్లి యువకులు వచ్చినప్పటికీ వారి నియమాలలో మార్పు రాకుండా పెద్దలు చూపిన బాటలోనే యువకులు కూడా పయనించడం విశేషం నేటి ఎలక్ట్రానిక్ ఆధునిక యుగంలో కంప్యూటర్స్ రంగప్రవేశం చేయడంతో వచ్చిన నూతన మార్పులలో నాటకరంగం పూర్తిగా కనుమ రుగయ్యే ప్రమాదం ఏర్పడింది. దీంతో ఆ నాటకరంగంపై ఆధారపడ్డ వేలాది కుటుంబలు జిల్లా, రాష్ట్రవ్యాప్తంగా దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారన్న విషయాన్నినిస్సందేహంగా చెప్పవచ్చు. ఈ తరుణంలో తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలంనల్లాకులవారిపాలెం గ్రామంలో శ్రీ భక్తాంజనేయస్వామి వారి వార్షికోత్సవాల్లో కనుమరుగవుతున్న కళారంగానికి వెన్నుదన్నుగా నిలుస్తూ అర్ధశతాబ్ద కాలం నుంచి ఆ నాటకరంగ ప్రదర్శనలను ప్రజలకు పునరావృతం చేస్తూనే ఉన్నారు. నల్లాకులవారి గ్రామంలో శ్రీభక్తాంజనేయస్వామి ఆలయం నిర్మించి ఇప్పటికి 51 సంవత్సరాలు కావచ్చింది. ఆనాటి నుండి నేటి వరకూ ప్రతి ఏడాది జరిగే వార్షికోత్సవాలు ఐదు రోజులలో కనీసం మూడు పౌరాణిక నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేసి నాటకరంగానికి వెన్నుదన్నుగా నిలుస్తున్నారు.నాటకరంగ కళాకారులు సైతం కనుమరు గవుతున్న నేటి కాలంలో నల్లాకుల వారిపాలెం గ్రామ ప్రజలు పౌరాణిక నాటక ప్రదర్శనలుఏర్పాటుచేయడం పట్ల నాటక రంగ ప్రియులు ఆ గ్రామ ప్రజలను ఉత్సవ కమిటీ వారిని ప్రశంసిస్తున్నారని చెప్పుకోవచ్చు. ఇప్పటికీ ఆ నాటికలకు వృద్ధులు పెద్దవారు సుదూర ప్రాంతాల నుండి వచ్చి ఇక్కడే భోజనం చేసి నాటిక మొత్తం చూసి మర్నాడు ఉదయం వారి వారి ఇంటికి వెళ్తారు కొద్ది మందిని వారి కుటుంబ సభ్యులు వచ్చి తీసుకువెళ్లడం పరిపాటి కనుమరుగవుతున్న నాటక రంగ కళను కళాకారుల ప్రతిభను నేటికి నిలబెడుతున్న నల్లాకులవారిపాలెం శ్రీ భక్తాంజనేయ స్వామి వారి ఆలయ ఉత్సవ కమిటీకి నాటక రంగ పిల్లలతో పాటు మనం కూడా అభినందనలు తెలియజేయాలి

# కులమతాలకు అతీతంగా కుంభాభిషేకానికి మద్దతు



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** ఇర్రిపాక గ్రామంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జగ్గంపేట మాజీ శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ తలపెట్టినటువంటి మహా మహా కుంభాభిషేకానికి కులమతాలకు అతీతంగా మద్దతు లభిస్తుంది. క్రైస్తవులు ముస్లింలు స్వయంగా ఈ కార్యక్రమంలో భాగస్వాములు అవుతున్నారు. గోకవరం మండలం క్లస్టర్ ఇంచార్జ్ దైవ సేవకులు కన్నబాబు ఆధ్వర్యంలో బియ్యం, ఈ యొక్క కార్యక్రమానికి పంపించడం జరిగింది. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని నేను మొదలు పెట్టినప్పుడు చాలామంది నిరుత్సాహపరిచారని కానీ కన్నబాబు మాత్రం చాలా గొప్ప కార్యక్రమమని నన్ను ప్రోత్సహించడం జరిగిందని తెలిపారు ప్రతిరోజు వేలాది మందికి అన్న సమారాధన కార్యక్రమం జరుగుతున్నదని , అటువంటి అన్న సమారాధన కార్యక్రమంలో కృష్ణని పాలెం గ్రామ టిడిపి నాయకులు భాగస్వాములు కావడం ఎంతో ఎంతో శుభ పరిణామమని క్లస్టర్ ఇంచార్జ్ కన్నబాబు తెలిపారు. సుమారు 6 కింటాలు బియ్యం, 100 కేజీల కందిపప్పు, సన్ ఫ్లవర్ మంచి నూనె నాలుగు డబ్బాలు, ఐదు బస్తాల ఉల్లిపాయలు ఇర్రిపాకకు పంపించడం జరిగిందని కన్నబాబు తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో మండిగ గంగాధర్, ఉపసర్పంచ్ కిషోర్, సి ఓ యమ్ రాజు పాస్టర్, బోలగుండ రాజారెడ్డి, మండిగ బాలాజీ,సిద్ధ సురేష్,కొంగరపు రాజు,జల్లేపల్లి వాసు,మేడి రాజు,షేక్ సుభాని,బంటుమిల్లి రాంబాబు, అంకం రెడ్డి రామన్న దొర గొర్రెపూడి పోసి బాబు, ముగడా ప్రభాకర్, అల్లాడ అరుణ, బర్నింకల మంగాదేవి,దొమ్మేటి శీను, అల్లాడి శ్రీను, రాపాక వీరబాబు, అల్లాడ వెంకటరమణ, అమర దొర,అందుబోయిన గోవిందు, అందుబో యిన దత్తాత్రేయ, కాటా నరేష్, అల్లాడ దేవిశ్రీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాలు చెంతనే ఉన్నా... ప్రజలకు మౌలికవసతులు సున్నా...

**- డ్రైనేజీ లేక మురుగునీరు నిలవతో దోమలబెడద...**
**- పట్టించుకోని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు...**
**- దోమలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు...**



**దేవిపట్నం, మేజర్‌న్యూస్ :**దేశానికి గ్రామాలే పట్టుకొమ్మలు అన్న జాతిపిత మహాత్మాగాంధీజీ వారి కలలను సాకారం చేస్తూ నవసకానికి నాందిపలుకుతూ మన ప్రియతమముఖ్యమంత్రివర్యులు గ్రామసచివాలయాల ఏర్పాటుద్వారా పరిపాలనా వ్యవస్థలను సామాన్యులకి అందుబాటులోకి తీసుకొచ్చారు. గ్రామసచివాలయాల ఉద్యోగులు అందుబాటులో ఉండి ప్రజా అవసరాలు తీరుస్తూ ప్రభుత్వానికి,ప్రజలకు వారధిలా ఉంటారని ఆశించారు. సుమారు పంచాయతీ ఎన్నికల జరిగే మూడు సంవత్సరాల పూర్తయిన ఇప్పుటి వరకు కనీసం డ్రైనేజీ పని సైతం పూర్తి చేయలేదని ఈ డ్రైనేజీ నిర్మాణం కాకపోవడంతో సిసి రోడ్డు కూడా పాడైపోతుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధించిన శాఖ అధికారులు స్పందించి డ్రైనేజీ నిర్మాణంపూర్తి చేసి,మురుగునీరు నిలువ ఉండకుండా చూడాలని డ్రైనేజీ లేక దోమలతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు,గ్రామస్తులు, పలువురు సంబంధిత అధికారులను కోరుతున్నారు.